RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 272 ISSUE NO : 272 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | ఆదివారం, ఏప్రిల్,26, 2026 Sunday, April, 26, 2026 | పేజిలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



మరో 47మంది అజ్ఞాత మావోల

## లొంగుబాటు

**గణపతి తదితరులు ఇంకా అజ్ఞతంలోనే ఉన్నారు**

**తెలంగాణ డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు.

మే 5నుంచి బెంగాల్లో..

## మహిళలకు స్వేచ్ఛ

**రాత్రి ఒంటిగంట తరవాత కూడా స్వేచ్ఛగా రావచ్చు**

**ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా**

కోల్‌కతా, ఏప్రిల్25 :ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్వ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు.





## ప్రధాని నరేంద్రమోదీ తెలంగాణ పర్యటన ఖరారు

ఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9వ తేదీన ఆయన రాష్ట్రానికి రానున్నారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర పర్యటన ఖరారైంది. పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. హైదరాబాద్ నగరంలోని పరేడ్ మైదానంలో భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు చేస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయ్యాక తెలంగాణకు రావడం ఇదే మొదటిసారి. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆయన తెలంగాణకు వస్తారు. తెలంగాణ పర్యటనలో భాగంగా ఎంఎంటీఎస్ ఫేజ్-2ను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. బీబీనగర్ ఎయిమ్స్ హాస్పిటల్‌ను జాతికి అంకితం చేసే అవకాశముంది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులకు శంకుస్థాపన చేసే అవకాశముంది. కాగా, మల్లారెడ్డి యూనివర్సిటీలో నిర్వహించే కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానించారు.



ఆప్‌కు స్వాతి మాలివాల్

## గుడ్‌బై..

**ఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీకి రాజ్యసభ ఎంపీ స్వాతి మాలివాల్ రాజీనామా చేశారు. పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఆప్‌ను కుదిపేస్తున్న సమయంలో కేజ్రీవాల్ ఇంట్లో స్వాతి మాలివాల్‌పై వ్యక్తిగత కార్యదర్శి దాడి చేశాడు. అప్పట్లో పెను దుమారం రేపింది. అప్పటి నుంచి ఆమె పార్టీకి దూరంగా ఉంటున్నారు. తాజాగా పార్టీపై తిరుగుబావుటా ఎగరేసింది. కాషాయ గూటికి చేరింది.**

తాజాగా 10 మంది ఆప్ రాజ్యసభ ఎంపీల్లో ఏడుగురు తిరుగుబావుటా ఎగరేశారు. ఏడుగురు ఎంపీలు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిశారు. ముగ్గురు స్వయంగా కలవగా.. మరో నలుగురు కూడా చేరుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో మండు వేసవిలో ఆమ్ ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలినట్లైంది. అన్హరత వేటు తప్పించుకునేందుకు 2/3 వంతు చీలికతో బీజేపీలో విలీనం అవుతున్నట్లుగా రాఘవ్ చద్దా ప్రకటించారు. ఇది ఆప్‌కు ఊహించని షాక్ తగిలినట్లైంది. శుక్రవారం రాఘవ్ చద్దా, సందీప్ పాఠక్, అశోక్ మిట్టల్ బీజేపీ నేతలను కలవగా.. వారితో పాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ కూడా బీజేపీ గూటికి చేరుతున్నారు.

**రాజీనామా చేసినట్లు ప్రకటన**

కేజ్రీవాల్ తన ఇంటి నుంచి వెళ్లిన గంటల్లోనే

## రాజీనామా చేసిన అశోక్ మిట్టల్



**ఏడాది కాలంగా అశోక్ మిట్టల్ నివాసంలో ఉంటున్న కేజ్రీవాల్ కుటుంబం**

**కేజ్రీవాల్‌కు జాతీయ పార్టీ అధినేత కింద భవనం కేటాయింపు**

**నిన్న తనకు కేటాయించిన భవనానికి వెళ్లిపోయిన కేజ్రీవాల్**

ఢిల్లీ,: ఏడాది క్రితం ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు తన నివాసంలోకి ఘన స్వాగతం పలికిన అశోక్ మిట్టల్, నిన్న కేజ్రీవాల్ తన నివాసాన్ని ఖాళీ చేసిన గంటల్లోనే పార్టీ మారి అధినేతకు షాకిచ్చారు. శుక్రవారం రాఘవ్ చద్దా సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు ఎంపీలు ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన వారిలో అశోక్ మిట్టల్ కూడా ఉన్నారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ గత సంవత్సరం బెయిల్‌పై విడుదలైన తర్వాత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు.



ఇరాన్‌తో చర్చలకు..

## ట్రంప్ గ్రీన్ సిగ్నల్

**పాకిస్థాన్‌కు ప్రత్యేక రాయబారులు!**

ఢిల్లీ,: అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో చర్చలు జరిపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఈ చర్చల కోసం పాకిస్థాన్‌కు ప్రత్యేక రాయబారులను పంపనున్నట్లు వైట్‌హౌస్ శుక్రవారం ప్రకటించింది. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఈ వివరాలను వెల్లడించారు. ఇరాన్ నుంచి సానుకూల సంకేతాలు వస్తున్నాయని, వారు నేరుగా చర్చలు జరపాలని కోరుకుంటున్నారని తెలిపారు. "దౌత్యానికి అవకాశం ఇవ్వడానికి అధ్యక్షుడు ట్రంప్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. అందుకే ప్రత్యేక రాయబారులు స్టీవ్ వాఫ్, జారెడ్ కుష్నర్‌లను పాకిస్థాన్‌కు పంపాలని నిర్ణయించారు.






కవిత సారథ్యంలో..

## తెలంగాణ రాష్ట్ర సేన ఆవిర్భావం

- తెలంగాణ కోసం పిడికిలి బిగించి కొట్లాడినం
- నా చెమటను చిందించి..పోరాటం చేశా
- సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు
- తెలంగాన కోసం పోరాడిన వారంతా మోసపోయారు
- మునుపటి కెసిఆర్..ఇప్పుడు లేడన్నది సత్యం
- పాలమూరు-రంగారెడ్డిని కూడా పూర్తి చేసుకోలేదు
- అందుకే ప్రజల పక్షాన..ప్రజల కోసం టిఆర్ఎస్‌తో వచ్చా
- పార్టీ పేరు, జెండా, ఎజెండాను ప్రకటించిన కవిత

హైదరాబాద్,తెలంగాణ దిశ : తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త పార్టీ ఆవిర్భవించింది. కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేశారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ సభలో పార్టీ పేరును కవిత ప్రకటించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉన్నమూడు పార్టీలు తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం లేదన్నారు. బిఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం, బిజెపిల చేతగానితనం కారణంగా తెలంగాణ రాష్ట్రస సేన ఏర్పాటు తప్పలేదన్నారు. ఈ మూడు పార్టీలకు వ్యతిరేకంగా పోరాడడమే ఎజెండగా ఐదు ప్రధాన హామీలతో పాంచజన్యం పూరించారు. ఏ కలలతో తెలంగాణ తెచ్చుకున్నామో అవి నిజం కాలేదన్నారు.



కేదార్‌నాథ్‌కు పోటెత్తిన

## భక్తులు

**- తొలి మూడు రోజుల్లోనే 90 వేల మందికి పైగా దర్శనం**

రుద్రప్రయాగ్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్న తర్వాత భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఈ యాత్రా సీజన్‌లో ఆలయం తెరిచిన మొదటి మూడు రోజుల్లోనే 90,000 మందికి పైగా యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారని జిల్లా అధికారులు వెల్లడించారు. ఈ నెల 22న బుధవారం హిమాలయాల్లోని ఈ ఆలయ తలుపులు భక్తుల కోసం తెరుచుకున్న విషయం తెలిసిందే. కేదార్‌పురిలోని యాత్రా ఏర్పాట్లను సమీక్షించిన అనంతరం రుద్రప్రయాగ్ ఎస్పీ నిహారికా తోమర్ ఈ వివరాలను వెల్లడించారు. "ప్రారంభ రోజుల్లో భక్తుల్లో భారీ ఉత్సాహం కనిపించింది. ఇప్పటివరకు 90 వేల మందికి పైగా యాత్రికులు దర్శనం పూర్తి చేసుకున్నారు" అని ఆమె తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం తొలి రోజైన ఏప్రిల్ 22న అత్యధికంగా 38,000 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

# ప్రజాక్షేత్రంలో పని చేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో టికెట్లు

- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 25, (తెలంగాణ దిశ) :**ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలో ఉండి పనిచేసే వారితో పాటు పార్టీ పటిష్టతకు కృషి చేసే వారికే మున్సిపల్ ఎన్నికలలో పార్టీ టికెట్ ఇస్తామని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం సర్కిల్ పరిధిలో గాజులరామారం, మహాదేవపురం, షాపూర్ నగర్, సురారం డివిజన్ల కు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ఆరు గ్యారెంటీలతో పాటు రేషన్ కార్డులు, పేదలకు సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను ప్రజలకు చేరవేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. అదే విధంగా రాబోయే గ్రేటర్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి డివిజన్‌లో నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రజాక్షేత్రంలో పని చేసే వారికి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కల్పించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మేడిచల్ జిల్లా అధ్యక్షురాలు రాజానోళ్ల లక్ష్మీ, డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ తో పాటు గాజులరామారం సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్ల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రెవెన్యూ అధికారుల తనిఖీలో తాకట్టు దుకాణంలో లోపాలు





**కీసర, ఏప్రిల్ 25, (తెలంగాణ దిశ) :**కీసర తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని రెవెన్యూ ఇన్ స్పెక్టర్ విశ్వనాథ్, బాబా రాందేవ్ జ్యువెలర్స్ అండ్ పాన్ బ్రోకర్‌పై వచ్చిన ఫిర్యాదును పరిశీలించేందుకు సంఘటన స్థలానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాధితురాలు సంతోషిని నుండి వివరాలు సేకరించారు. పరిశీలన సమయంలో మాజీ వార్డు కౌన్సిలర్ పంగ హరిబాబు కూడా హాజరయ్యారు. రెవెన్యూ అధికారులు దుకాణంలోని తాకట్టు పుస్తకాలను పరిశీలించగా పలు కీలక లోపాలు బయటపడ్డాయి. ముఖ్యంగా వడ్డీ రేటు నమోదు చేయకపోవడం, బంగారం ప్యూరిటీ వివరాలు నమోదు చేయకపోవడం, గ్రాస్ వెయిట్, నెట్ వెయిట్ వివరాలు లేకపోవడం, ప్రస్తుత మార్కెట్ విలువ నమోదు చేయకపోవడం వంటి అంశాలు గుర్తించారు. అదే విధంగా పాన్ టికెట్ వెనుక భాగంలో అవసరమైన సంతకాలు లేకపోవడం, టర్మ్స్, కండిషన్స్ సరైన విధంగా నమోదు చేయకపోవడం కూడా బయటపడింది. పరిశీలన సమయంలో బాబా రాందేవ్ జ్యువెలర్స్ యాజమాన్యం అందుబాటులో లేకపోవడంతో తదుపరి విచారణను వచ్చే నెల 2వ తేదీన కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ పంగ హరిబాబు గారు రెవెన్యూ ఇన్ స్పెక్టర్ తో మాట్లాడుతూ ఈ వ్యవహారంపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సంబంధిత లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదనంగా తాకట్టు పెట్టిన నగలను చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్నందున బాధితులందరికీ సమాచారం అందించి, ఎలాంటి వడ్డీ లేకుండా వారి నగలను తిరిగి ఇవ్వాలని కోరారు.

# కోర్టు విధులకు అడ్డుకున్న నిందితుడిపై కేసు నమోదు

**కుషాయిగూడ, ఏప్రిల్ 25, (తెలంగాణ దిశ) :** కుషాయిగూడలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో కోర్టు విధులను అడ్డుకున్న వ్యక్తిపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. కుషాయిగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫిర్యాదు దారుడు జె. కృష్ణ ×ం అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం బెంచ్ క్లర్క్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 12. 30 గంటల సమయంలో కుషాయిగూడలోని అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ఇంచార్జీ విధులు నిర్వహిస్తున్న సమయంలో క్రైమ్ నెంబర్ 31/2025, యు/ఎస్ 118(1), 115(2), 352 ఆర్/డబ్ల్యూ 3(5) బిఎన్ఎస్, పీఎస్ నేరేడ్‌మెట్ కేసులో నిందితుడైన బి. సురేష్‌ను కోర్టుకు పిలిచారు. అతన్ని ఎస్కార్ట్ పోలీస్ సిబ్బంది, ఏఎస్ఐ మొహమ్మద్ ముక్తార్ అహ్మద్ కోర్టు ముందు హాజరు పరిచారు. అయితే నిందితుడు తనను అనవసరంగా అరెస్ట్ చేశారని ఆరోపిస్తూ కోర్టు హాల్లో అసభ్య పదజాలం ఉపయోగించి, కోర్టు విధులకు భంగం కలిగేలా ప్రవర్తించాడు. దీంతో ఎస్కార్ట్ పోలీసులు వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని కోర్టు హాల్ నుంచి బయటకు తీసుకెళ్లారు. కోర్టు విధులకు ఆటంకం కలిగించడం, కోర్టు అధికారులపై అసభ్య పదజాలం ఉపయోగించడం వంటి చర్యలపై జె. కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎల్. భాస్కర్ రెడ్డి తెలిపారు.

# మార్కెట్ లో మ్యాంగో హవా



రంగారెడ్డి, : పండ్లకు రారాజు అయినా మామిడి సీజన్ వచ్చింది. మార్కెట్ లో మ్యాంగో హవా మొదలైంది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బాటసింగారంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్కు మామిడి కాయల రాక క్రమంగా పెరుగుతూ ఉంది రాష్ట్రంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కావడంతో రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది. ఈ ఏడాది ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ లో మామిడి క్రయ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బాటసింగారం మార్కెట్ లో మామిడి కుప్పలతో నిండిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక, తెలంగాణలోని అల్లాపూర్, గద్వాల్, రంగారెడ్డి నల్గొండ, వరంగల్, సూర్యాపేట్, మహబూబ్నగర్, తిమ్మాజీపేట్, కరీంనగర్, వికారాబాద్, అనంతపూర్, పరిగి, వనపర్తి, యాదగిరిగుట్ట, అంకిరావుపల్లి, చారకొండ తదితర ప్రాంతాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, గూడ్స్ వాహనాలు, ఆటో ట్రాలీలు పండ్ల మార్కెట్ కు తరలివ స్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 2,48, 219 క్వింటాళ్లు దిగుమతులు ఎగుమతులు జరిగాయి. నాణ్యతనుబట్టి టన్నుకు సగటున రూ. 30 వేల నుంచి రూ. 40 వేల ధర పలు కుతోంది. మంచి రకాలకు క్వింటా 1 లక్ష పలుకుతుంది. మార్కెట్ కు వచ్చిన మామిడిని రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు. బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బెనిషాన్, తోతా పూరి, హిమాయత్, నాతి, పెద్ద రసాలు, చిన్న రసాలు, సుందరి, మల్లిక, కేసరి, దాసేరి, అప్పుసా తదితర రకాల మామిడి పండ్లు దిగుమతి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటిల్లో అత్య ధిక ధర హిమాయత్ రకం కిలో రూ. 200 ధర పలు కుతుండగా, అత్యల్పంగా నాటి రకం కిలో రూ. 8-14 ధర పలుకుతోంది. వీటిలో చెట్టుపైనే కవర్ కట్టిన పండ్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ధర కూడా టన్నుకు రూ. లక్ష వరకు పలుకు తోందని అధికారులు పేర్కొంటున్నారు. మార్కెట్ లో క్రయవిక్రయాలు సజావుగా సాగే విధంగా, ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ఏర్పాట్లు చేశాం. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాక పోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించాం. మార్కెట్ లో రైతులు, వ్యాపారులు దాహం తీర్చుకునేందుకు చల్లటి తాగునీటి యంత్రాలు ఏర్పాట్లు చేశాం. మామిడిని ప్యాకింగ్ చేసే క్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రకారమే ఇథలిన్ ప్యాకెట్లను మోతాదులో వాడే విధంగా వ్యాపారులకు సూచనలు చేశాం. నిబంధనలను అతిక్రమిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు..

# ప్రాణాలు తీస్తున్న స్లీపర్ బస్సులు?

**హైదరాబాద్,తెలంగాణ దిశ:** హైదరాబాద్ మహానగరంలో నడి రోడ్డుపై స్లీపర్ బస్ తగలబడిపోయింది. ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటే కూకట్‌పల్లి- కేపీహెచ్‌బీ రహదారిపై ఈ దుర్ఘటన జరిగింది. ఇది ప్రయాణికులను, స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదంగానే కాకుండా దేశంలో నడుస్తున్న స్లీపర్ బస్‌ల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లుకు బయల్దేరిన శ్రీ దుర్గా మహే శ్వరి ట్రావెల్స్ కు చెందిన ఏసీ స్లీపర్ బస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కేపీహెచ్‌బీ పరిధిలోని పద్మావతీ ప్లాజా బస్ స్టాప్, మెట్రో పిల్లర్ 734 సమీపంలోకి రాగానే బస్ డ్రైవర్ క్యాబిన్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించాడు. వెంటనే డ్రైవర్, సహాయకు డు అప్రమత్తమయ్యారు. బస్‌ను పక్కకు నిలిపివేసి అందులోని 18 మంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేశారు. ప్రయాణికులు కిందకు దిగిన కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్ అంతటా వ్యాపించి, వాహనం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసినప్పటికీ బస్ పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినప్పటికీ బస్ అస్తిపంజరంలా మారిపోయింది. ప్రాథమిక సమాచారం మేరకు ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్లీపర్ బస్‌ల డిజైన్‌పై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వీటిని కొన్ని దేశాలు డెత్ బస్‌లుగా అభివర్ణిస్తారు. స్లీపర్ బస్సుల్లో బెర్త్‌ల మధ్య ఉండే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు త్వరగా బయటకు రావడానికి వీలుపడదు. సాధారణ బస్సులతో పోలిస్తే స్లీపర్ బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లుఅందుబాటులో ఉండం తక్కువ. పైగా ఉన్న ఎగ్జిట్‌లు కూడా బెర్త్‌ల వల్ల మూసుకుపోయే అవకాశం ఉంది. కూకట్‌పల్లి ఘటనలో డ్రైవర్ అప్రమత్తమవ్వడం, ప్రయాణికులు మెళకువగా ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పింది. కాని గతంలో జరిగిన ప్రమాదాలు చూస్తే ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటం వల్ల ఏదైనా జరిగితే వెంటనే స్పందించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. పై బెర్త్‌ల నుంచి కిందకు దిగి బయటకు రావడం అత్యవసర సమయంలో కష్టమవుతుంది. భారత్‌లో స్లీపర్ బస్సులు విరివిగా వాడుకలో ఉన్నప్పటికీ అనేక అభివృద్ధి చెందిన దేశాలు వీటిని నిషేధించాయి. చైనా ప్రభుత్వం వీటిని 2012లోనే నిషేధించింది. ఉత్పత్తి, రిజిస్ట్రేషన్లపై పూర్తిగా బ్యాన్ వేశారు. 2012, 2011లో జరిగిన ఘోర ప్రమాదాల్లో దాదాపు 77 మంది చనిపోయారు. దీంతో చైనా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జర్మనీలో కూడా 2006 నుంచి స్లీప్ కోచ్‌లను నిషేధించారు. బస్ కదులుతున్నప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అక్కడి రూల్. అయితే స్లీపర్ పొజిషన్‌లో అది వీలుప డదని తేలడంతో బ్యాన్ వేశారు యూకేలో 2000 నుంచి నిషేధం ఉంది. కేవలం కొన్ని ప్రత్యేక టూరిస్ట్ కోచ్‌లకు మాత్రమే పరిమిత అనుమతి ఉంది. వియత్నాంలో పూర్తిగా నిషేధం లేకపోయినా కొండ ప్రాంతాల్లో, కొన్నిప్రధాన హైవేలపై స్లీపర్ బస్‌ల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. భారత్‌లో చాలాప్రాంతాల్లో స్లీపర్ బస్‌లు ప్రమా దాల బారిన పడుతున్నాయి. రోజూ ఏదో ప్రాంతంలో స్లీపర్ బస్‌లు ప్రమాదానికి గురి అవుతున్న వార్తలు చూస్తున్నాం. మేజర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వాలు హడావిడి చేయడమే తప్ప వాటిపై సీరియస్‌గా చర్యలు తీసుకున్న ఒక్క ఘటన కూడా లేదు. దీంతో ఉల్లంఘనలు,ప్రమాదాలుసర్వసాధారణమైపోయాయి. పీహెచ్ బీ ఘటనలో 18 మంది ప్రాణాలతో బయటపడటం కేవలం డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల జరిగిన అదృష్టం మాత్రమే. కానీ ప్రతి సారీ అదృష్టం తోడు ఉండకపోవచ్చు.

# ఏఐతో భాషా ప్రావీణ్యం వస్తుందా?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మదిలోని భావాన్ని వ్యక్తపరచే వాహకమే భాష. ఇది నమ్మకాలను ప్రోదిచేస్తుంది. సంస్కృతిని నిర్మిస్తుంది. చరిత్రను ఆమోదిస్తుంది. ఒక జాతికి గుర్తింపు తెచ్చిపెడుతుంది. తొలినాళ్లలో దూరంగా ఉన్నవారికి సమాచారం అందించడానికి దూతను పంపేవారు. ఆ తర్వాత ఉత్తరం వచ్చింది. దాని తర్వాత వచ్చిన ఫోన్ మాట్లాడే దూరాన్ని చెరిపేసింది. దీనికి అదనంగా మెయిల్, వాట్సాప్ వంటి సమాచార సాధనాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయి. ఇపుడు నేరుగా మాట్లాడడానికి వీడియో కాల్స్ అందుబాటులో ఉన్నాయి. అయితే, ఎన్ని సాధనాలు వచ్చినా భాష మాత్రం మారలేదు. అలానే ఉన్నది. అప్పుడు, ఇప్పుడు ఇద్దర్ని కలిపేది మాటే. సాధనాలు మారాయి. అంతే..కానీ ప్రేరణ అలానే నిలిచి ఉన్నది. కృత్రిమ మేధ ఇపుడు నేర్చుకోవడం, పని పద్ధతులను తిరగ రాస్తున్నది. ఇది గణిత సమీకరణాలను పరిష్కరిస్తున్నది. వ్యాసాలు రచిస్తున్నది. సంగీత బాణీలను కడుతున్నది. ఇలా ఎన్నో చేస్తున్నది. ఈ మేధ ట్యూటర్‌గా, అనువాదకునిగా, సహచరునిగానూ వ్యవహరిస్తున్నది. తర్కం, స్థిరవ్యవస్థలపై నిర్మితమైన లెక్కలు, ఇంజినీరింగ్ తదితర శాస్త్ర విషయాలు ఇప్పటికే ఏఐ ప్రభావంతో రూపాంతరం చెందాయి. సంక్లిష్ట సైన్స్ సూత్రాల వివరాలు ఇప్పుడు ఏఐ ద్వారా తక్షణమే పొందగలుగుతున్నాం. కథలు చెప్పగలిగేవారే ప్రపంచంలో అత్యంత శక్తిమంతులు అంటారు పెద్దలు. మాట అంత మహత్తరమైనది. భాష ఒక జాతి సంస్కృతి, భావోద్వేగాల జీవన శ్వాస. ఏఐ వ్యాకరణాన్ని, పదజాలాన్ని వివరించగలదు. కానీ హాస్యం, వ్యంగ్యం, ప్రేమలు పట్టుకోలేదు. యంత్రం సాయంతో చేసిన అనువాదం సాంకేతికంగా సరిగానే ఉండవచ్చు. అయితే దీనిలో హృదయం లోపిస్తుంది. ఎవరైనా ఒకరు 'ఐ మిస్ యు' అంటే, దానిలో భావోద్వేగం ఇమిడి ఉంటుంది. ఆ ఉద్వేగ అనుభూతి యంత్రానికి సాధ్యం కాదు కదా! టెక్నాలజీ అనువాద క్రియను చాలా సులువు చేసింది. తెలుగు ఉత్తరమో, వ్యాసమో కేవలం క్షణాల్లో తప్పులు లేకుండా ఏఐ మరో భాషలోకి అనువదిస్తుంది. అది కచ్చితంగా ఉంటుంది. కానీ పేలవం అనిపిస్తుంది. అనువాదం అంటే ఒక భాష నుంచి మరో భాషలోకి తర్జుమా మాత్రమే కాదు కదా! అనువాదం అంటే విషయంలోకి పరకాయ ప్రవేశం చేసి అందించడం. అందుకే భాష భిన్నమైనదని భాషావేత్తలు చెప్తారు. సైన్స్ ఫార్ములా తెలుసుకోవడం ఓ వియుక్త నైపుణ్యం. మాట్లాడటమే భాష. మాటలో, నవ్వులో, స్వరంలో అనేక భావాలు దాగి ఉంటాయి. ఆలోచన చెప్పడంలో పొరపడి, జాగ్రత్తగా దిద్దుకుంటాం. ఇవి అన్నీ చిన్న చిన్న విషయాలు అనిపిస్తాయి. ఇవి తీపి, చేదు అనుభూతులు కలిగిస్తాయి. మనలో విశ్వాసం పెంపొందిస్తాయి. ఒకరితో ఒకరిని కలుపుతాయి. ఎందరో గురువులను అందిస్తాయి. భాష నేర్చుకోవడంలో మెలకువలు నేర్పుతాయి. ఇది సజీవ శిక్షణ. ఆ సజీవతను ఏ యాప్, చాట్ బోట్‌లు మనకు అందించగలవు? కృత్రిమ మేధో సాధనాలు పలు రకాలుగా సాయపడతాయి. అవి పలుకుబడిని సరిచేస్తాయి. వ్యాకరణాన్ని వివరిస్తాయి. ఇంకా వ్యక్తిగతీకరించిన అభ్యాసాన్ని అందిస్తాయి. ఇవి టీచర్లకు బాగా ఉపయోగపడతాయి. పాఠ్యప్రణాళిక రాసుకోవచ్చు, విద్యార్థుల నుంచి వేగంగా అభిప్రా యాలూ సేకరించవచ్చు. ఎదుటి వ్యక్తి మాటల్లోని భావోద్వేగాన్ని అర్థం చేసుకొనే ప్రయత్నాన్ని యంత్రాలు భర్తీ చేయలేవు. భాషాపటిమ ధారాళంగా మాట్లాడటం ద్వారా రాదు. సహానుభూతి ద్వారానే వస్తుంది. సజీవ భాషలు నిరంతరం అభివృద్ధి చెందుతూనే ఉంటాయి. యాస, మర్యాదపూర్వక సంభాషణా స్వరాలు మెల్లగా అనుభవంతో అలవడతాయి. యంత్రం వీటిని నమోదు చేయగలదు. కానీ అది మనిషి కాదు కదా! కనుక అది మన మాటల లయలో పాల్గొనలేదు. వినడం, అర్థం చేసుకోవడం, తగిన విధంగా ప్రతిస్పందించడం నిరంతర తర్ఫీదు, ఇదే నిజమైన భాషా ప్రావీణ్యత సాధనా మార్గం. గత కొన్ని దశాబ్దాలుగా పట్టణీకరణ జోరందుకున్నది. ఆంగ్ల మాధ్యమ కాన్వెంట్ చదువులు విస్తృతంగా పెరిగాయి. ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఇప్పుడు ఇంగ్లిష్ తప్పని సరైంది. నేడు ఏ భాషనైనా ఏఐ పరికరాల సాయంతో అనువదించడం చాలా సులువైం ది. కష్టం లేకుండా చేస్తున్నది టెక్నాలజీ. ఇదే పెనుముప్పు కలిగించే అవకాశం ఉన్నది. భాష నేర్చుకోవలసిన అవసరం లేదనే భావన మనలో ఏర్పరుస్తున్నది. అందుకే టెక్నాలజీని నేర్పుగా వాడాలని భాషా శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. భాష నేర్వడం అంటే పదవినియోగం, శ్రద్ధగా వినడం, జవాబు చెప్పడం, చదవడం, రాయడం మాత్రమే కాదు, సాంస్కృతిక సందర్భం గుర్తెరగాలి.

## కమ్యూనిటీ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్,తెలంగాణ దిశ :** నిర్మల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో (వార్డు నెంబర్ 13) రూ. 5లక్షల ఎంపీలాడ్స్ నిధుల ద్వారా కామన్ కమ్యూనిటీ షెడ్ నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, స్థానిక కౌన్సిలర్ ధర్మాజీ గారి రమ్య ఈశ్వర్, పట్టణ కౌన్సిలర్లు సాధం అరవింద్, గంజి రాజు, శ్రీరామోజీ నరేష్, పట్టణ బీజేపీ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేపీ నాయకులు మెడిసెమ్మ రాజు, ఒడ్నాల రాజు, తో పాటు పట్టణ బీజేపీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు

## భైంసా అభివృద్ధికి నిధుల కోసం వినతి

నిర్మల్-భైంసా: నిర్మల్ జిల్లా భైంసా పట్టణ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి ఈ రోజు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు సంబంధించి వినతి పత్రాన్ని సమర్పించారు. పట్టణంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న అవసరాల దృష్ట్యా మౌలిక వసతుల అభివృద్ధి అత్యవసరమని చైర్మన్ వివరించారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణం,డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల,తాగునీటి సరఫరా,వీధి దీపాల ఏర్పాటు, పార్కులు మరియు ఇతర ప్రజా సౌకర్యాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

# సంపాదకీయం

## విపక్షాల ఐక్యతను బలోపేతం చేసిన మోడీ!

ప్రజాస్వామ్యంలో నిరంకుశం చేస్తామంటే కుదరదు. ప్రతి విషయంలోనూ అలాగే వ్యవహరిస్తున్న మోడీ, ఇప్పుడు 131వ రాజ్యాంగ సవరణ విషయంలోనూ అలాగే చేసారు. మహిళా బిల్లు సందర్భంగా సరిగ్గా అదే జరిగింది. బిజెపి నిరంకుశ విధానంపై ఓ రకంగా తిరుగుబాటుగానే భావించాలి. అలాగే విపక్షాలను ఐక్యం చేసిన ఘనత కూడా మోడీదనే చెప్పాలి. వారి ఓటు చెక్కుచెదరకుండా వేయగలిగారు. అలాగే వారంతా ఒక్కటిగా నిలబడేలా చేశారు. ఇది భవిష్యత్ రాజకీయాలకు కీలక మలుపుగా భావించాలి. అందుకే 131వ రాజ్యాంగ సవరణ వీగిపోయింది. ఇకపోతే మహిళా బిల్లు వేరు..డీ లిమిటేషన్ వేరు. 2023లోనే దీనిని ఆమోదించి, 2029 నుంచి అమల్లోకి తీసుకుని వస్తామని గతంలోనే చెప్పారు. అనూహ్యంగా ఇప్పుడు రెండూ కలగలిపి తీసుకుని రావడం ద్వారా బిజెపికి శృంగభంగం తప్పలేదు. నిజానికి ఈ బిల్లులను తీసుకుని వచ్చే ముందు అఖిలపక్షంలో చర్చించలేదు. విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదు. సొంతపార్టీలో చర్చించలేదు. ఎన్‌డిఏ పక్షాలతోనూ చర్చించలేదు. బహుశా మోడీ, అమిత్ షాలు మాత్రమే చర్చించుకుని ఈ సవరణ బిల్లుకు యత్నించి ఉంటారు. బహుశా వారు ఇలాంటి పరిణామం ఎదురవుతుందని కూడా ఊహించ ఉంటారు. దీనిని ఆసరాగా చేసుకుని విపక్షాలను ఎండగట్టాలన్న ఉద్దేశం కూడా ఇందులో దాగి ఉంటుంది. అయితే విపక్షాల ఐక్యత ఇప్పుడు మోడీకి సవాల్ కానుంది. మొన్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజార్టీ కోల్పోయింది. కేవలం ఎన్‌డిఎ పక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతోంది. కనీసం ఎన్‌డిఎ పక్షాలతో అయినా మోడీ సమగ్రంగా చర్చించి ఉంటారని అనుకోవడానికి లేదు. ఒకప్పుడు బిజెపిలో మేధావి వర్గం ఉండేది. ఏదైనా సమస్యను ముందు పార్టీలో మేధావి వర్గంతో చర్చించేవారు. ఎత్తులు వేసేవారు. కానీ మోడీ వచ్చాక పెద్దలను దూరం పెట్టారు. ఇప్పుడు పెద్దా, చిన్నా అంతా ఆయనే. అందుకే మహిళా బిల్లు ముసుగులో డీలిమిటేషన్ తీసుకుని రావాలన్న ఎత్తుగడలను ప్రతిపక్షాలు ఉమ్మడి గా చిత్తుచేశాయి. మహిళా బిల్లును ఉన్నపళంగా అమలు చేయడానికి విపక్షాలు సిద్దంగా ఉన్నాయి. కానీ మోడీ ఎందుకనో అలా చేయకుండా మెలికి పెట్టారు. డీలిమిటేషన్ వల్ల కూడా సభ్యుల సంఖ్య పెరిగితే కూడా నష్టమే. 542 స్థానాలు ఉన్న లోక్‌సభ 600 వరకు పెరిగితే ఫర్వాలేదు. కానీ 816 లేదా 850కి పెంచాలన్న తీరు మాత్రం ఆమోదించదగ్గది కాదు. రాజకీయంగా పదవులు పెరిగితే దేశానికి నష్టమే తప్ప లాభం లేదు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బిజెపి వ్యవహరించిన తీరు, దానిని తరిస్కరించిన వైనం బిజెపికి గుణపాఠం కావాలి. ఇప్పటికైనా మేల్కొని ప్రజాస్వామ్య బద్దంగా పాలన చేయకుంటే విపక్షాలు మరింత ఐక్యం అవుతాయని నిరూపించాయి. ఇప్పటికే సర్ ప్రక్రియ సెగరేపుతోంది. ఇప్పుడు 131 సవరణ తోడయ్యింది. ప్రజలు ఎప్పుడూ బిజెపి వెంటే ఉంటారని అనుకోవడానికి లేదు. తాజా 131 సవరణ ప్రతిపాదన దక్షిణాదిలో కూడా తీవ్ర చర్చకు దారితీసింది. తమకున్న అధికారం పోతోఉందని, తమ ప్రాతినిధ్యానికి విలువ ఉండదన్న భావనలో ఇక్కడి నేతలు వచ్చారు. అందుకే దక్షిణ్భాది నేతలు కేంద్ర ప్రభుత్వం హడావిడిగా తెచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా పోరాటం చేసారు. మోదీ సర్కారుకు ఓటమి రుచి చూపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ముందుపెట్టి.. డీలిమిటేషన్ బిల్లును ఆమోదింపజేసుకోవాలన్న కేంద్ర ఎత్తుగడను లోక్‌సభలో శుక్రవారం మూకుమ్మడిగా తిప్పికొట్టడం వెనక ఈ ఐక్యత స్పష్టంగా కనిపించింది. మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు సభలో వీగిపోయేలా చేయటంలో దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు కూడా కీలకపాత్ర పోషించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్టీలు మినహా తెలంగాణ, కేరళ, తమిళనాడు, కర్ణాటకలోని ఎన్డీయే యేతర పార్టీల ఎంపీలంతా ఈ బిల్లును మరో ఆలోచనకు తావులేకుండా తిరస్కరించారు. తమిళనాడుకు చెందిన 38మంది, కేరళలోని 20 మంది, తెలంగాణలోని 9మంది, కర్ణాటకలోని 9 మంది ఎన్డీయే యేతర ఎంపీలు డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవటంలో కీలకపాత్ర పోషించారు. డీలిమిటేషన్ బిల్లును బహిరంగా తగులబెట్టి తమ నిరసన ఏ స్థాయిలో ఉంటుందో చూడాలని కేంద్రాన్ని తమిళనాడు సిఎం స్టాలిన్ సవాల్ చేశారు. పార్లమెంటులోనూ తమిళనాడు ఎంపీలు నల్ల దుస్తులు ధరించి బిల్లుకు వ్యతిరేకంగా బలంగా పోరాటం చేశారు. కొత్తగా జనాభా లెక్కలను సేకరించకుండానే మోదీ సర్కారు ఏకపక్షంగా, హడావిడిగా డీలిమిటేషన్‌కు పూనుకోవటం పై అందరిలోనూ అనుమానాలు బలపడ్డాయి. కేంద్రం దక్షిణాదికి ద్రోహం చేస్తోందని ఎలుగెత్తారు. తమ రాష్ట్రాల ప్రాతినిధ్యం లేకుండానే భవిష్యత్తులో ఉత్తరాది బలంతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు జరిగేలా దక్షిణాది ప్రాతినిధ్యంతో పనిలేకుండా చేయటమే మోదీ సర్కారు అసలు లక్ష్యమని విమర్శలు గుప్పిం చారు. రాజ్యాంగాన్ని బలహీనపర్చి, దేశ ఎన్నికల ముఖచిత్రాన్నే మార్చేయాలని కేంద్రం కుట్ర చేస్తోందని కమ్యూనిస్టు పార్టీలు కూడా పోరాటం చేశాయి. అందుకే కసిగా ఉన్న స్టాలిన్ 'ఢిల్లీని తమిళనాడు ఓడించింది' అని ప్రకటించారు. ఈ క్రమంలో ఇప్పుడు బిజెపి పునరాలోచన చేయాలి. పెద్దలను, మేధావులను గౌరవించడం అలవాటు చేసుకవాలి. కీలకమైన ఇలాంటి సవరణల సందర్భంలో విపక్షాలను విశ్వాసంలోకి తీసుకో వాలి. డీలిమిటేషన్ కూడా లిమిట్ దాటకుండా సీట్లను కుదించాలి. అందరి ఆమోదంతో మళ్లీ బిల్లును ప్రవేశ పెట్టడం ద్వారా ముందుగా మహిళా బిల్లుకు ఆమోదం దక్కేలా చూడాలి. అప్పుడే పోయిన పరువు కొంతయినా దక్కుతుంది. అంతే తప్ప మహిళా బిల్లును వ్యతిరేకించారన్న ప్రచారం ఫలితం ఇవ్వదని గుర్తించాలి.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్..

# నిలిచిపోయిన రిటర్న్స్.. రీసేల్ మార్కెట్ వెలవెల!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్ నగరం నలుమూలలా ఇప్పుడు ఆకాశహర్మ్యాలే కనిపిస్తున్నాయి. అపరిమితమైన ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ సౌలభ్యంతో బిల్డర్లు 40-50 అంతస్తుల మేర భవనాలను నిర్మిస్తున్నారు. అయితే, పైకి చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాల వెనుక ధరలు, అయోమయ మౌలిక వసతులు దాగున్నాయ నే చర్చ మొదలైంది. హైదరాబాద్‌లో రూ. 2 కోట్ల పైబడిన ఫ్లాట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ఈ ధరలకు కేంద్రబిందువుగా మారింది. అయితే కొత్త లాంచ్‌లలో ఉన్న జోరు రీసేల్ మార్కెట్‌లో లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటివి ఇన్వెస్టర్లను, గృహ కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో కొత్త ప్రాజెక్టుల లాంచ్‌లు ఏకంగా 46శాతం పడిపోవడం మార్కెట్ మందగమనానికి సంకేతంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా, ముఖ్యంగా రెడిట్ వంటి ప్లాట్‌ఫారమ్స్‌లో నెటిజన్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. "హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో చదరపు అడుగుకు రూ. 8,000 నుంచి రూ. 12,000 వసూలు చేస్తున్నారు. కానీ, వర్షం వస్తే ఆ రోడ్లపై నడవగలమా? డ్రైనేజీ వ్యవస్థ ఉందా? కనీసం తాగునీటి సరఫరా ఉందా?" అని కొనుగోలుదారులు నిలదీస్తున్నారు. పశ్చిమ హైదరాబా ద్‌లోని ఐటీ కారిడార్‌లో సుమారు 20,000కు పైగా లగ్జరీ యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ఈ భారీ భవనాల్లో వేల సంఖ్యలో కుటుంబాలు చేరితే, ఇప్పటికే ఊపిరాడని ట్రాఫిక్‌తో సతమతమవు తున్న ఆ ప్రాంత మౌలిక వసతులు ఆ భారాన్ని మోయగలవా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సరైన రోడ్లు, డ్రైనేజీ లేని చోట రూ. 2 కోట్లు పోసి ఫ్లాట్ కొనడం 'లగ్జరీ' అనిపించుకుం టుందా లేక 'నరకం' అవుతుందా అని నెటిజన్లు చర్చించుకుంటు న్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎప్పుడైనా రీసేల్ మార్కెట్ బలంగా ఉంటేనే ఆ రంగం ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క అని నిపుణులు చెబుతుంటారు. కానీ హైదరాబాద్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది.: మూడేళ్ల క్రితం ఒక కోటి రూపాయలు పెట్టి కొన్న ఫ్లాట్, ఈరోజు అమ్మాలంటే కొనేవారే లేరు! ఒకవేళ ఉన్నా, కొన్న ధరకే అడగడం లేదా అంతకంటే తక్కువకు బేరం చేయడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాంకు వడ్డీలు కలుపుకుంటే, మూడేళ్ల తర్వాత ఆ ఆస్తి విలువ పెరగకపోగా, ఇన్వెస్టర్లు నికరంగా నష్టపోతున్నారు. "మా స్నేహితుడు పెట్టుబడి కోసం లగ్జరీ అపార్ట్‌మెంట్ కొన్నాడు, ఇప్పుడు బయటపడలేకపో తున్నాడు," అని ఒక బాధితుడు పేర్కొన్నాడు. నివాస యోగ్యం కాని ప్రాంతాలు: భారీ నిర్మాణాల వల్ల వచ్చే దుమ్ము, తక్కువ జనాభా వంటి కారణాలతో కొత్త కమ్యూనిటీలు కేవలం పేరుకే 'హైటెక్'గా మిగిలిపోతున్నాయని, పాత నగరంలో ఉన్న సౌకర్యం, అనుబంధం ఇక్కడ లేవని కొందరు అభిప్రాయప డుతున్నారు. హైదరాబాద్? రియల్ ఎస్టేట్- అసలు ఈ డిమాండ్‌ను నడిపిస్తోంది ఎవరు?: ధరలు ఇంతలా ఉన్నా, కొత్త లాంచ్‌లలో బుకింగ్స్ జరుగుతున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. దీని వెనుక ప్రధానంగా మూడు శక్తులు ఉన్నాయి:ఐటీ రంగంలోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, భారీగా ఈ-సాప్స్ పొందిన టెక్కీలు ఆఫీసులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో ఈ భారీ ధరలకు వెనకాడటం లేదు.: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం ప్రవాస భారతీయులకు కలిసి వస్తోంది. వారు హైదరాబాద్‌ను ఒక సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా చూస్తున్నారు.: తెలంగాణలో భూముల ధరలు పెరగడంతో, తమ ఊర్లలో భూములు అమ్మిన వారు ఆ డబ్బును నగరంలోని లగ్జరీ ఫ్లాట్లపై పెడుతున్నారు.: బిల్డర్లు ఎక్కువ అంతస్తులు కట్టే అవకాశం ఉండటంతో క్లబ్‌హౌస్‌లు, గ్రీన్ స్పేస్‌లు వంటి సౌకర్యాలతో ప్రాజెక్టులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. 2026 మొదటి త్రైమాసికం: ఒక హెచ్చరిక!: నోబ్రోకర్ నివేదిక ప్రకారం, 2026 క్యూ1లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ భారీ కరెక్షన్‌ను చూసింది. నివాస గృహాల లాంచ్‌లు ఏకంగా 46% పడిపోయాయి. గతంలో నెలకువేల సంఖ్యలో కొత్తయూనిట్లు మార్కెట్ లోకి వచ్చేవి, కానీ మార్చి నెలలో కొత్త సరఫరా దాదాపు శూన్యం. హైదరాబాద్‌లో 80శాతం కంటే ఎక్కువ ఫ్లాట్లు 3బీహెచ్?కే లేదా అంతకంటే పెద్దవి మాత్రమే ఉంటున్నాయి. సగటు ఫ్లాట్ సైజు 2,050 చదరపు అడుగులుగా ఉంది. సామాన్య మధ్యతరగతి వ్యక్తికి అవసరమైన 2బీహెచ్ కే లేదా చిన్న ఫ్లాట్లు మార్కెట్ నుంచి మాయ మైపోతున్నాయి. దీనివల్ల దాదాపు 84% మంది కొనుగోలుదారులు "అఫర్డబిలిటీ స్ట్రెస్" (ధర భరించలేకపోవడం) ఎదుర్కొంటున్నారు. ఎస్టేట్- భవిష్యత్తు ఏంటి?: అపరిమిత ఎఫ్?ఎస్?ఐ అనేది ఒక వరంలా కనిపించినా, అది నిర్మాణ వ్యయాన్ని కూడా విపరీతంగా పెంచేస్తోంది. ఆకాశహర్మ్యాలు కట్టాలంటే కావాల్సిన ఇంజనీరింగ్ టెక్నాలజీ, సేఫ్టీ సిస్టమ్స్ వల్ల బిల్డర్లపై భారం పడుతోంది. అది తిరిగి కస్టమర్ల మీదనే పడుతోంది. మౌలిక వసతులు మెరుగుపడకుండా కేవలం భవనాలు మాత్రమే పెరిగితే, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బబుల్ పేలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పాఠశాలలో పారిశుధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి

## జిల్లా కలెక్టర్ అంకిత్





**భద్రాద్రి,తెలంగాణ దిశ :**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్స వాల సందర్భంగా మొదటి రోజు జిల్లా కలెక్టర్ అంకిత్ టేకులపల్లి మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం విధానాన్ని కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. వంటగది పరిస్థితులు, వంట తయారీ ప్రక్రియను తనిఖీ చేసి, విద్యార్థులకు అందించే భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వంటకు ఉపయోగించే సరుకుల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకో వాలని సూచించారు. పాఠశాల పరిసరాలలో పారిశుద్ధ్యం పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని అన్నారు . ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించిన కలెక్టర్, అది ఎప్పుడు ఏర్పాటు చేశారో, గత రెండు సంవత్సరాలుగా ఎందుకు వినియోగంలో లేదో సంబంధిత అధికారులను ప్రశ్నించారు. దీనికి అధికారులు పాఠశాలలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా సమస్య ఉండటంతో ప్లాంట్‌ను ఉపయోగించలేకపోతున్నామని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్, తక్షణమే త్రీఫేస్ కరెంట్ సమస్యను పరిష్కరించి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం టేకులపల్లి మండలం నంద్యా తండాలోని ఏకలవ్య పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, వారికి అందుతున్న సదుపాయాలు, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించి రోజువారీ శుభ్రత నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని , పాఠశాలలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని, సంబంధిత సిబ్బంది క్రమం తప్పకుండా శుభ్రత పనులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం డైనింగ్ హాల్‌ను పరిశీలించిన కలెక్టర్, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారో లేదో తనిఖీ చేసి, నిర్దేశిత మెనూను ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థులకు వండుతున్న ఆహార పదార్థాలను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. స్టోర్ రూమ్‌లో ఉంచిన కూరగాయలను పరిశీలించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తాజా కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. కూరగాయలను నేలపై ఉంచడంపై వార్డెన్‌ను ప్రశ్నించి, వెంటనే ర్యాక్‌లు ఏర్పాటు చేసి శుభ్రంగా నిల్వ చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎల్లప్పుడూ నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి శ్రీరామ్, తాసిల్దార్ వీరభద్రం, ప్రిన్సిపల్ రవీంద్ర, సంబంధిత శాఖల అధికారులు తదితరులు

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించవద్దు

### ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే భూములు సేకరించాలి

### గడ్డ పోతారం పరిధిలో నూతన ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటుకు కసరత్తు

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### నియోజకవర్గ స్థాయి ప్రభుత్వ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

**పటాన్ చెరు,తెలంగాణ దిశ :** ప్రజలకు అత్యంత ఆవశ్యకమైన తాగునీరు సరఫరా, నిరంతర విద్యుత్ పంపిణీ, పారిశుధ్యం అంశంలో అలసత్వం వహించ వద్దని, నిరంతరం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. ఉదయం క్యాంపు కార్యాలయంలో అమీన్పూర్, పటాన్ చెరు బల్దియా డిప్యూటీ కమిషనర్లు, ఆయా మండలాల తహాసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, మున్సిపల్ చైర్మన్లు, విద్యుత్, నీటిపారుదల, పిసిబి, జాతీయ రహదారులు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిపారుదల, జల మండలి, పరిశ్రమలు, టౌన్ ప్లానింగ్ శాఖల అధికారులతో వివిధ అంశాలపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వేసవి కాలంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు, నిర్దేశించిన సమయంలో తాగునీరు పంపిణీ చేయాలని సూచించారు. లో వోల్టేజి సమస్యలు తలెత్తకుండా విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా నూతన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఐదు మున్సిపాలిటీలకు మంజూరైన 75 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు అతి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. జిహెచ్ఎంసి పరిధిలోని 9 డివిజన్ల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వంతో చర్చించి మరిన్ని నిధులు కేటాయించ బోతున్నట్లు తెలిపారు. అమీన్పూర్ పరిధిలో 23 కోట్ల రూపాయలతో 55 పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన కాలనీలకు సైతం మంచి నీటిని పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని జలమండలి జిఎం శ్రీనివాస్ కు సూచించారు. నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని ఇప్పటికే జలమండలి ఎండి అశోక్ రెడ్డికి సైతం విన్నవించడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మంచినీటి పంపిణీ అంశంలో జాప్యం జరగకూడదని ఆదేశించారు. బల్దియా పరిధిలోని పార్కుల సుందరీకరణ కోసం 10 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని సంబంధిత అధికారులు తెలిపారు. అభివృద్ధి పనుల అంశంలో విద్యుత్, జలమండలి, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శర వేగంగా జరుగుతున్న పట్టణీకరణ మూలంగా ప్రభుత్వ భూముల లభ్యత అత్యంత ఆవశ్యకమని.. ప్రజా ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పరిశ్రమలకు కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే జిఎంఆర్ ను కోరారు. ఇందుకు భిన్నంగా పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్, పరిశ్రమలకు కేటాయిస్తే ప్రజా ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూరులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులు కొనసాగుతున్నాయని.. అతి త్వరలో శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు. అమీన్పూర్



మున్సిపల్ పరిధిలోని 993 సర్వే నెంబర్ లో నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం భూమి కేటాయింపు జరిగిందని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు భూమి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు. ఇదే సర్వే నంబర్ లో ఎస్టిపి కోసం కేటాయించిన 10 ఎకరాల భూమిని ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా రద్దు చేయాలని కలెక్టర్ ని కోరనున్నట్లు తెలిపారు. గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ టీ పి ఏర్పాటు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, జిహెచ్ఎంసి పరిధిలో విలీనమైన గ్రామాలలోని గ్రామ కంఠాల పరిధిలో ఇళ్ల అనుమతుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ అంశంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు కలిసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించ కూడదని, నిధుల కొరత ఉంటే తనను నేరుగా సంప్రదించాలని కోరారు. పటాన్ చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# విన్నంతలో ఎన్ని వింతలో..



సంగీతం కాలక్షేపానికి సాధనం కాదు. శ్రావ్యమైన సంగీతం ఓ థెరపీ. మనసును ప్రశాంతంగా ఉంచే సాధనం ఇది. సంగీతానికి రోగాలను నయం చేసే శక్తి ఉందని పలు పరిశోధనల్లో తేలింది. చక్కటి పాటలు, మ్యూజిక్ వినడం వల్ల రక్త ప్రసరణ సజావుగా సాగుతుందనీ, ఊపిరితిత్తులు లయబద్ధంగా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అమృతగానం వింటూ ఆదమరిస్తే.. మానసిక ఆందోళనలు తోకముడుస్తాయని అంటున్నారు. ఒత్తిడి నుంచి ఉపశమనానికి సంగీతాన్ని మించిన మార్గం లేదు. అయితే, మానసిక ఒత్తిడికి గురైనప్పుడు పాటలు కాకుండా.. వాద్య సంగీతం వింటే మరింత మేలు కలుగుతుందట. ఉదయం కోడి కూసే వేళకు తోడిరాగం ఆస్వాదించండి.. తక్షణ ఉపశమనం లభించడం ఖాయం.

పాటలు వింటూ వ్యాయామం చేయడం వల్ల ఎక్కువ ఫలితం లభిస్తుంది. బరువు తగ్గాలని భావించేవారు సంగీతం వింటూ వ్యాయామం చేస్తే ఫలితాలు బాగుంటాయట. మనలో మరింత ఉత్సాహం పెరుగుతుంది. మానసికంగా, శారీరకంగా కూడా ఉల్లాసంగా ఉండవచ్చు. ఒళ్లు నొప్పులు తగ్గించడంలోనూ సంగీతం గుణం చూపిస్తుందని ఎన్నో పరిశోధనల్లో తేలింది. అందుకే కొందరికి సర్జరీ సమయంలో, ఆ తర్వాత కూడా మంచి సంగీతం వినమని డాక్టర్లు చెబుతారు. గాయాలపాలైనప్పుడు రోజూ సంగీతం వినడం వల్ల నొప్పి నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. పిల్లల మెదడు ఎదుగుదలకూ సంగీతం తోడ్పడుతుంది. జోల పాటలు, రైమ్స్ వంటివి పిల్లల్లో ఐక్యూ స్థాయిని పెంచుతాయి. పాటలు వింటూ పెరిగే పిల్లలు, మిగతా వారితో పోల్చితే మరిన్ని తెలివితేటలు కలిగి ఉంటారని వైద్యులు చెబుతున్నారు. మహిళలు గర్భంతో ఉన్నప్పుడు మంచి సంగీతం వినడం వల్ల వారి కడుపులోని బిడ్డ కదలికల్లో మార్పు వస్తుందట. నెలలు నిండకుండా పుట్టిన పిల్లల్లోనూ ఆరోగ్యం మెరుగయ్యేందుకు సంగీతం సాయపడుతుంది. ఎన్నో మానసిక వ్యాధుల చికిత్సలో సంగీతం ఉపయోగపడుతుంది. అల్జీమర్స్ సమస్య ఉన్న వారు సంగీతం వింటే మతి మరుపును అధిగమించవచ్చు. ఆటిజంతో బాధపడుతున్న వారికి మ్యూజిక్ థెరపీ వల్ల వారి కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. డిప్రెషన్, ఆత్రుత, కోపం, భయం వంటి వాటిని తగ్గించే శక్తి సంగీతానికి ఉంది.

# కారంగా ఉంటుందని పచ్చిమిర్చిని పక్కన పెట్టేస్తున్నారా..

## ఈ లాభాలు తెలిస్తే ఇకపై అలా చేయరు..!

ఒకప్పుడు మన పూర్వీకులతోపాటు పెద్దలు కూడా పచ్చి మిర్చిని రోజూ తినేవారు. దీన్ని వారు తమ రోజువారి ఆహారంలో భాగం చేసుకునేవారు. చద్దన్నంలో పచ్చి మిర్చిని నంజుకుని తినేవారు. అయితే పచ్చి మిర్చి వల్ల కలిగే లాభాలు తెలిస్తే ఎవరైనా దీన్ని ఇష్టంగా తింటారు. ఒకప్పుడు మన పూర్వీకులు వీటిని రోజూ తినేవారు. అందుకనే వారు ఎంత వయస్సు వచ్చినా ఆరోగ్యంగా ఉండేవారు. ఈ క్రమంలోనే పచ్చి మిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలు పొందవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పచ్చి మిర్చి కారంగా ఉంటుందని చాలా మంది తినేందుకు ఆసక్తిని చూపించరు. కూరల్లో వచ్చినా పడేస్తుంటారు. కానీ పచ్చి మిర్చిలో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.

రోగ నిరోధక శక్తికి..: పచ్చి మిర్చిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. నారింజ పండ్లలో కన్నా పచ్చి మిర్చిలోనే అధికంగా విటమిన్ సి ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కనుక పచ్చిమిర్చిని ఆహారంలో భాగం చేసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. రోగాలు రాకుండా చూస్తుంది. పచ్చి మిర్చిలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. దీంతో కంటి చూపు మెరుగు పడుతుంది. కళ్ల సమస్యలు తగ్గిపోతాయి. వృద్ధాప్యంలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. బరువు తగ్గేందుకు..: పచ్చి మిర్చిలో విటమిన్ బి6, బి9 అధికంగా ఉంటాయి. ఇవి మన శరీర మెటబాలిజంను మెరుగు పరుస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. ఈ విటమిన్ల వల్ల నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యం



మెరుగు పడుతుంది. నరాల బలహీన తగ్గుతుంది. మెడ, భుజాల నొప్పుల నుంచి ఉపశ మనం లభిస్తుంది.ఎర్ర రక్త కణాలుఉత్పత్తి అవుతాయి.రక్తం పెరుగు తుంది. రక్తహీనత తగ్గుతుంది. పచ్చిమిర్చిలో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి.ఇవి ఆక్సీకరణఒత్తిడిని తగ్గిస్తాయి.దీంతో క్యాన్స ర్, డయాబెటిస్, గుండె జబ్బులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. జీర్ణక్రియకు..: పచ్చిమిర్చిలో క్యాప్సెయిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది థర్మోజెనిక్ గుణాలను కలిగి ఉంటుంది. అంటే శరీర ఉష్ణోగ్రతను కాసేపు పెంచుతుందన్నమాట. దీంతో మెటబాలిజం పెరుగుతుంది. ఫలితంగా క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. కాబట్టి పచ్చి మిర్చిని తింటుంటే బరువును తగ్గించుకోవడం తేలికవుతుంది. పచ్చి మిర్చిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఫలితంగా ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయపడుతుంది. పచ్చి మిర్చిని అధికంగా తింటే కడుపులో మంట వస్తుంది. కానీ మోతాదులో తింటే జీర్ణ క్రియకు సహాయ పడతాయి. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తాయి. ఇలా పచ్చిమిర్చితో అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# అశ్వగంధ.. ఓ అద్భుతమైన మూలిక..

## ఇది అందించే ప్రయోజనాలు అమోఘం..

ఆయుర్వేదంలో అనేక రకాల మూలికలు ఉన్నాయి. అవి అనేక ఔషధ విలువలను కలిగి ఉంటాయి. అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. వాటిల్లో అశ్వగంధ కూడా ఒకటి. దీని పేరు మీరు వినే ఉంటారు. అశ్వగంధనే ఇండియన్ జిన్సెంగ్ అని, వింటర్ చెర్రీ అని కూడా పిలుస్తారు. ఇది మనకు మార్కెట్‌లో ఎక్కువగా పొడి రూపంలో లభిస్తుంది. అశ్వగంధకు చెందిన వేర్లను పొడిగా తయారు చేసి మనకు విక్రయిస్తారు. దీన్ని రాత్రి పూట పాలలో కలిపి తాగాల్సి ఉంటుంది. అశ్వగంధ చూర్ణాన్ని రోజూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అనేక వ్యాధులను నయం చేసే శక్తి అశ్వగంధకు ఉందని వారు అంటున్నారు. అశ్వగంధ మనకు అనేక అద్భుతమైన లాభాలను అందిస్తుందని వారు చెబుతున్నారు. అశ్వగంధ ఒత్తిడి హార్మోన్లను తగ్గిస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. నేటి తరుణంలో చాలా మంది నిత్యం ఒత్తిడి, ఆందోళనను ఎదుర్కొంటున్నారు. అలాంటి వారు అశ్వగంధను వాడుతుంటే ప్రయోజనం ఉంటుంది. ఈ పొడిని తీసుకుంటే మైండ్ రిలాక్స్ అయి నిద్ర కూడా చక్కగా పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి తగ్గుతుంది. అశ్వగంధ పొడిని తీసుకోవడం వల్ల శరీరం ఉత్సాహంగా మారుతుంది. యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. బద్ధకం పోతుంది. నీరసం, అలసట తగ్గుతాయి. ముఖ్యంగా రాత్రి పూట దీన్ని తీసుకుంటే మరుసటి రోజు మొత్తం ఉత్సాహంగా ఉంటారు.

పురుషుల శృంగార సామర్థ్యానికి.. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు కండరాల నొప్పుల బారిన పడుతుంటారు. అలాంటి వారు అశ్వగంధ చూర్ణాన్ని పాలతో కలిపి తీసుకుంటే ఆయా నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. తిరిగి పనిచేసేందుకు కావల్సిన శక్తి శరీరానికి లభిస్తుంది. కండరాలు నిర్మాణమవుతాయి. దేహం చక్కని ఆకృతిని పొందుతుంది. అశ్వగంధను తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులు



ఆక్సిజన్‌ను మరింత ఎక్కువగా శోషించుకుంటాయి. దీంతో ఊపిరితిత్తుల సామర్థ్యం సైతం పెరుగుతుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం పోతుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. అశ్వగంధ పురుషుల్లో శృంగార సామర్థ్యాన్ని పెంచుతుంది. ఇది వారి జననావయవాలకు రక్త సరఫరా జరిగేలా చూస్తుంది. దీంతో శృంగారంపై ఆసక్తి పెరుగుతుంది. వీర్యం వృద్ధి చెందుతుంది. సంతానం కలిగే అవకాశాలు మెరుగు పడతాయి.

మెదడు పనితీరుకు..: అశ్వగంధను తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగు పడుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. మతిమరుపు తగ్గుతుంది. అశ్వగంధ యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అందువల్ల ఈ పొడిని తీసుకుంటే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గుతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ నుంచి ఉపశమనం లభిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారికి కూడా అశ్వగంధ మేలు చేస్తుంది. దీన్ని తీసుకుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. అశ్వగంధ పొడి ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీని వల్ల సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఇలా మనకు అశ్వగంధ అనేక ప్రయోజనాలను అందిస్తుంది. అయితే దీన్ని తీసుకునే ముందు డాక్టర్ సలహాను పాటించాలి. కొందరికి ఇది పడకపోవచ్చు. కనుక డాక్టర్ సలహా మేరకు దీన్ని వాడుకుంటే మంచి ఫలితాలను రాబట్టవచ్చు.

# ఆరోగ్యంగా ఉన్నప్పుడే..



మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడు చేసే దాన ధర్మాలే నిజమైనవి. మంచి పనులు చేయాలని భావించి దానికి కట్టుబడి ఉండాలి. తన శక్తి మేరకు దైవ మార్గంలో ధనాన్ని ఖర్చు పెట్టాలి, దానాలు చేయాలి. మంచి పనులు చేస్తూ చనిపోతే తగినంత పుణ్యఫలం వస్తుంది. అయితే జీవితమంతా మంచిపనులు, దానాలు చేయకుండా కేవలం ముసలితనంలో, మరణ దశలో చేయడం సత్ఫలితాలను ఇవ్వవు. అల్లాహ్‌ను విశ్వసించి, ఆయన మార్గంలో పోరాడటం, దానం చేయడం ఉత్తమమైన సత్కార్యం. పని రాని వాళ్లకు పనిచేసి పెట్టడం, పనిచేసే వాళ్లకు సాయపడటం కూడా పుణ్య ఫలితాన్ని కలిగించేవే. ప్రతి తస్బీహ్ పలుకు ఒక సత్కార్యమే. అల్లాహ్‌ను కీర్తించడం, మంచిని ఆదేశించడం కూడా మంచిపనులే. సాటివారిని నవ్వుతూ పలకరించే మంచి నడవడిక కూడా మంచిపనే. ఇతరులను మాటలతో కాని, చేతలతో కాని హింసించకుండా ఉండటం కూడా గొప్పపనే. అందరూ ప్రార్థనలు చేసే మసీదులను శుభ్రం చేయడం దైవానికి ఇష్టమైన మంచిపని. ఇతరుల కోసం, భావితరాల కోసం పండ్ల చెట్లను నాటడం ఎంతో పుణ్యకార్యం. కష్టపడి చేసిన సత్కార్యానికి పుణ్యఫలం ఎక్కువగా ఉంటుంది. మన దగ్గర ఉన్న గుక్కెడు మేకపాలతో ఇతరుల దాహార్తి తీర్చినా పుణ్యప్రదమే. మంచి మనసుతో ఒక్క ఖర్జూరపు ముక్క దానం చేసినా మనం నరకాగ్ని నుంచి తప్పుకోవచ్చు. భూతదయ కలిగి ఉండటం, నలుగురు నడిచే బాటను శుభ్రం చేయడం, నమాజు కోసం మసీదు వైపు వేసే అడుగులు, ఇతరుల తగాదా పరిష్కరించడమూ మంచిపనుల ఖాతాలోకే వస్తాయి.

## అందానికి సబ్జా సాయం!

సబ్జా గింజలు.. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ముఖ్యంగా, వేసవిలో వేధించే వేడిని తగ్గిస్తాయి. శరీరం నుంచి టాక్సిన్స్‌ను బయటికి పంపడంలోనూ సాయపడుతాయి. అయితే, అందాన్ని కాపాడటంలోనూ సబ్జా గింజలు ముందుంటాయి. చర్మాన్ని లోలోపలి నుంచి శుభ్రం చేయడంలో సబ్జా గింజలు సమర్థంగా పనిచేస్తాయి. వీటిలో సహజంగా ఉండే డీటాక్స్ గుణాలు.. చర్మం లోపలి పొరల్లో చేరిన టాక్సిన్లను బయటికి పంపిస్తాయి. దాంతో చర్మం కాంతిమంతంగా మారుతుంది. మొటిమలూ తగ్గుముఖం పడతాయి. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్‌తో నిండిన సబ్జా గింజలు.. ఆకలిని నియంత్రిస్తాయి. ఫలితంగా బరువు తగ్గడంలో సాయపడతాయి.సబ్జా గింజల్లో ఉండే యాంటి బయోటిక్, యాంటి ఫంగల్, యాంటి మైక్రోబియల్ లక్షణాలు.. చర్మ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. ఇందుకు కారణమయ్యే బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించడంలో సహాయ పడతాయి. సబ్జాలో ఉండే చర్మ స్థితిస్థాపక లక్షణాలు.. చర్మం త్వరగా కోలుకోవడానికి తోడ్పడతాయి. చర్మానికే కాదు.. జుట్టుకూ సబ్జా గింజలు మంచి పోషణ అందిస్తాయి. వీటిలో అధికంగా లభించే విటమిన్ కె, బీటా కెరోటిన్, ఇతర ప్రొటీన్లు.. జుట్టు, కుదుళ్లు దృఢంగా ఉండేలా చేస్తాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే.. జుట్టు రాలే సమస్య తగ్గుతుంది.



# సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలంటే..

# ఈ ఆకుల జ్యూస్‌ను తీసుకోవాల్సిందే..!

ప్రతి ఏడాది లాగా కాకుండా ఈసారి కాస్త ముందుగానే వర్షాకాలం సీజన్ వచ్చింది. ప్రతి ఏడాది జూన్ 3వ వారంలో ఈ సీజన్ మొదలవుతుంది. కానీ మే నెల చివరి వారంలోనే అనూహ్యంగా నైరుతి రుతు పవనాలు ప్రవేశించాయి. దీంతో వాతావరణం చల్లబడింది. వేసవి తాపం నుంచి ఉపశనం లభించింది. అయితే అంతా బాగానే ఉంటుంది కానీ సీజన్ మారినప్పుడు దగ్గు, జలుబు, జ్వరం అందరినీ ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. ఈ సీజన్‌లో దోమలు విజృంభిస్తాయి. దీంతో డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలు కూడా ప్రబలుతుంటాయి. అయితే ఈ సీజన్ లో మన ఆరోగ్యం సురక్షితంగా ఉండాలంటే ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుకోవాల్సి ఉంటుంది. దీంతో రోగాలు, ఇన్‌ఫెక్షన్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఇమ్యూనిటీ పవర్ పెరగాలంటే అందుకు బొప్పాయి ఆకులు ఎంతగానో ఉపయోగపడతాయి.

జీర్ణ సమస్యలకు..: బొప్పాయి ఆకుల పేరు చెప్పగానే అందరికీ డెంగీ జ్వరానికి సంబంధించిన ప్లేట్‌లెట్ల విషయమే గుర్తుకు వస్తుంది. డెంగీ వచ్చిన వారిలో ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గుతుంది. దీంతో బొప్పాయి ఆకుల రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. దీంతో ప్లేట్‌లెట్ల సంఖ్య పెరిగి త్వరగా జ్వరం నుంచి కోలుకుంటారు. అయితే బొప్పాయి ఆకులు కేవలం ఇందుకే కాదు, ఇంకా అనేక రకాల అనారోగ్య సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల జ్యూస్‌ను సేవిస్తుంటే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఈ ఆకుల జ్యూస్‌లో పపైన్, కైమోపపైన్ అనే ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి మనం తిన్న ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తాయి. కనుక అజీర్తి ఉన్నవారు ఈ ఆకుల రసాన్ని తాగుతుంటే ఎంతగానో ఉపశమనం లభిస్తుంది. తిన్న ఆహారం జీర్ణమై అజీర్తి తగ్గుతుంది. అలాగే గ్యాస్, కడుపు ఉబ్బరం, అసిడిటీ నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

షుగర్ తగ్గేందుకు..: జీర్ణాశయంలో అల్సర్లు ఉన్నవారు బొప్పాయి ఆకుల రసాన్ని తాగుతుంటే ఫలితం ఉంటుంది. మలబద్ధకం ఉన్నవారికి కూడా ఈ ఆకులు ఔషధంగా పనిచేస్తాయి. బొప్పాయి ఆకుల్లో పపైన్‌తోపాటు ఫ్లేవనాయిడ్స్, విటమిన్ ఇ అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. అందువల్ల బొప్పాయి ఆకుల రసాన్ని తాగితే శరీరంలోని వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, చర్మంపై దద్దుర్లు ఉన్నవారికి ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఆయా సమస్యలను వెంటనే తగ్గించుకోవచ్చు. ఈ ఆకుల రసాన్ని సేవిస్తుంటే షుగర్ లెవల్స్ కంట్రోల్‌లో ఉంటాయని పలువురు సైంటిస్టులు జంతువులపై చేసిన అధ్యయనాల్లో వెల్లడైంది. బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తుంటే ఇన్సులిన్ సరిగ్గా ఉత్పత్తి అవుతుంది. దీన్ని శరీరం సక్రమంగా వినియోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. రోగ నిరోధక శక్తికి..: బొప్పాయి ఆకుల్లో విటమిన్లు ఎ, సి, ఇలతోపాటు అనేక యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి చర్మ కణాలను రక్షిస్తాయి. దీంతో కొల్లాజెన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఇది చర్మం కాంతివంతంగా మారేలా చేస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, మొటిమలు పోతాయి. యవ్వనంగా కనిపిస్తారు. బొప్పాయి ఆకుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు రాకుండా చూస్తుంది. బొప్పాయి ఆకుల పేస్ట్‌ను జుట్టుకు నేరుగా అప్లై చేయవచ్చు. దీంతో చుండ్రు, దురద, జుట్టు రాలడం తగ్గిపోతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా, ఆరోగ్యంగా ఉంటుంది. ఇలా బొప్పాయి ఆకులతో అనేక లాభాలను పొందవచ్చు. అయితే బొప్పాయి ఆకుల రసాన్ని రోజుకు 2 సార్లు, పావు టీస్పూన్ మోతాదులోనే తీసుకోవాలి. ఎక్కువగా తీసుకుంటే అలర్జీలు వచ్చి వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం, విరేచనాలు అవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలర్జీలు ఉన్నవారు ఈ జ్యూస్‌ను సేవించకూడదు.

# మేనికి.. పసుపు నూనె



ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలో 'పసుపు' ముందుంటుంది. అయితే, పసుపు మొక్క వేళ్ల నుంచి తీసిన నూనె కూడా అందాన్ని అందలం ఎక్కిస్తుందని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ముఖంపై మొటిమలు, మచ్చలకు కారణమయ్యే సీబమ్ ఉత్పత్తిని క్రమబద్ధం చేయడంలో పసుపు నూనె సమర్థంగా పనిచేస్తుంది. ఫలితంగా మొటిమల బెడద తగ్గుతుంది. పసుపు నూనెలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు, యాంటి ఇన్‌ఫ్లమేటరీ గుణాలు.. చర్మానికి కావాల్సిన తేమను అందించి, పొడి చర్మం సమస్యను దూరం చేస్తాయి. ఇక ముఖంపై ముడతలు, గీతలను నివారించడం వల్ల మేనిఛాయ మరింత మెరుగవుతుంది.

పసుపు నూనెలో యాంటి మైక్రోబియల్ గుణాలు సమృద్ధిగా ఉంటాయి. ఇందులో ఉండే 'కర్క్యుమిన్' అనే సమ్మేళనం.. చర్మ సంబంధ ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది. మొటిమలు, తామర, సొరియాసిస్ వంటి చర్మ సమస్యలనూ తగ్గిస్తుంది. ముఖంపై ఏర్పడే కొన్ని రకాల మచ్చలనూ నివారిస్తుంది. ఇందులోని యాంటి ఆక్సిడెంట్స్.. ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేస్తాయి. చర్మకణాలు దెబ్బతినకుండా కాపాడి.. వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదింప జేస్తాయి. చర్మంపై మడతలు, మచ్చల్ని దూరం చేస్తాయి. దాంతో.. చర్మం ఎప్పుడూ యవ్వనంగా కనిపిస్తుంది.

# వల్లభనేని వంశీకి షాక్



**విజయవాడ,తెలంగాణ దిశ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ భవిష్యత్తు విషయంలో ఇప్పుడు ఆసక్తి నెలకొంది. 2019లో పార్టీ మారిన ఆయన.. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ విషయంలో అనుసరించిన వైఖరి ఇప్పుడు ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది అనే మాట వాస్తవం. ఇక ప్రస్తుతం వైసీపీలో ఉన్నవల్లభనేని వంశీ మోహన్.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానికి సంబంధించి స్పష్టత రావటం లేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వంశీ, మళ్లీ వెనక్కు తగ్గినట్లుగానే కనబడుతోంది.అయితే గ్రామాల్లో ఆయనకు కొంత ఫాలోయింగ్ ఉండటంతో, వంశీ ప్రజల్లోకి వెళ్లాలని ఆ పార్టీ అధిష్టానం కూడా కోరుతున్నప్పటికీ వంశీ దూకుడు ప్రదర్శించడం లేదు. కేసులు భయం కారణంగా వంశీ వెనక్కు తగ్గుతున్నట్లుగా స్పష్టంగా అర్థం అవుతుంది. వచ్చే ఎన్నికల నాటికి గన్నవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి అంటే.. కచ్చితంగా వంశీ ప్రజల్లోకి రావాలని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం కూడా వంశీ పై ఉంది.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే పై వచ్చే ఆరోపణల విషయంలో, కూడా వంశీ కాస్త దూకుడు ప్రదర్శించాలని ఆ పార్టీ నాయకత్వం కోరుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వంశీ బయటకు రావడానికి ఇష్టపడటం లేదు. దీనితో గన్నవరం నియోజకవర్గంలో, ఇన్చార్జిను మార్చాలనే ఆలోచనలో కూడా పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో కసరత్తు కూడా చేశారని, అయితే ఒకరిద్దరి నేతలు అధినేత వైఎస్ జగన్ వద్ద నియోజకవర్గ పరిస్థితిని ప్రస్తావించడంతోనే వెనక్కు తగ్గినట్లుగా తెలుస్తోంది.వంశీ అరెస్టు విషయంలో గ్రామాల్లో కొంత సానుభూతి ఉంది అనే ప్రచారం కూడా ఉంది. దీనిని వంశీ వాడుకునే ప్రయత్నం కొంత చేసినప్పటికీ ఆ తర్వాత పరిస్థితులు సహకరించకపోవడంతో మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఇక నియోజకవర్గంలో నాయకత్వాన్ని మారిస్తే, భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధిష్టానానికి ఇప్పటికే కొంతమంది చెప్పినట్లుగా వైసిపి వర్గాలు అంటున్నాయి. అందుకే వంశీ విషయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉందని సమాచారం.

# పోటీ చేయాలంటున్న కేడర్...

**నెల్లూరు,తెలంగాణ దిశ :** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉంది.ప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా..

# ఎన్నికలకు రెడీ అవుతున్న ఈసీ!




**విజయవాడ,తెలంగాణ దిశ :** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటి నుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

## మేకలపై చిరుత దాడి

**అనంతపురం,తెలంగాణ దిశ:** గుడిబండ మండలంలోని చిగతుర్పి గ్రామంలో లింగప్పకు చెందిన రెండు మేకలు చిరుతదాడిలో మృతిచెందాయి. బాధితుడు లింగప్ప ఇంటివద్ద కట్టేసిన మేకలపై ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి చంపింది. దీంతో రూ.20వేలు నష్టం వాటిల్లిం దని బాధితుడు వాపోయాడు. ఫారెస్ట్ అధికారులు గ్రామానికి చేరుకుని మేకల కళేబరాలను పరిశీలించారు. అనంతరం పశువైద్యాధికారులతో పోస్ట్‌మార్టం నిర్వహించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# సైలెంట్ మోడ్ లోకి కొట్టు సత్యనారాయణ



**ఏలూరు,తెలంగాణ దిశ :** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరుగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట. ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్లాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిం దన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో.. ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే..తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమం టూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు.కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తా రో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టివ్ అవుతారా? లేక తనదారి తన చూసు కుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

# మూడు ప్రాంతాల్లో 3 ఎకనామిక్ రీజియన్స్

**విజయవాడ,,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బడ్జెట్ లో తాజాగా కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి, అన్ని జిల్లాల్లో సమాన వృద్ధిని సాధించడమే ఈ భారీ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో.. విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలు కోసం ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చేందుకు, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించిందని చెప్పారు. నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కి ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారువిశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ ఇంజిన్లు ఉన్నాయి. వీటిలో మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయంలో 41పైగా ఇంపాక్ట్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని చెప్పారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల నుంచి సమకూర్చుకుంటామని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేకాదు.. మెట్రో రైల్ ప్రాజెక్టులు సహా వీఈఆర్ కి సంబంధించి సుమారు 28వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని చెప్పారు.వీఈఆర్ తరహాలోనే అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ రీజియన్ పరిధిలోకి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు రానున్నాయి. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి దోహదం చేసే వనరులు.. గ్రోత్ ఇంజిన్లు, బలాల్ని గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తెలిపారు.వీఈఆర్, అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి తరహాలో.. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ను ప్రభుత్వం సిద్ధం చేసింది. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 303 మండలాల్లో 200పైగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్స్ గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

# దిగుమతుల ఉధృతి





**జనవరిలో 19 శాతం పెరుగుదల**
**34.68 బిలియన్ డాలర్లకు వాణిజ్య లోటు**
**ఎగుమతులు అంతంతే..**

ముంబయి : భారత ఉత్పత్తులు విదేశీ మార్కెట్లలో వెలవెలపోతోన్నాయి. ఈ ఏడాది జనవరిలో సరుకుల ఎగుమతులు అంతంత మాత్రంగానే నమోదు కాగా.. దిగుమతులు అమాంతం పెరిగాయి. దీంతో వాణిజ్యలోటు ఏకంగా 34.08 బిలియన్ డాలర్లు ఎగిసింది. ఇది భారత కరెన్సీలో దాదాపు రూ.3 లక్షల కోట్లకు సమానం. ఎగుమతుల కంటే ఈ మొత్తం విలువ చేసే దిగుమతులను అదనంగా నమోదు కావడం తీవ్ర ఆందోళకరం. రాయిటర్స్ లాంటి అంతర్జాతీయ ఏజెన్సీలు 26 బిలియన్ల కంటే తక్కువ లోటు ఉండొచ్చని అంచనా వేయగా.. వాస్తవ గణాంకాలు ప్రమాద ఘంటికలను మోగిస్తోన్నాయని నిపుణులు భావిస్తున్నారు. భారత ఆర్థిక వ్యవస్థకు వాణిజ్య పరంగా జనవరి నెల గట్టి ఎదురుదెబ్బనే అని పేర్కొంటున్నారు. సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ప్రధానంగా బంగారం, వెండి దిగుమతులు అదుపులేకుండా పెరగడమే ఈ భారీ లోటుకు కారణమైంది. మరోవైపు ఎగుమతుల్లో పురోగతి లేకపోవడం లోటును అమాంతం పెంచింది. బంగారం, వెండి రవాణా భారీగా పెరగడంతో దిగుమతుల విలువ 63.55 బిలియన్ల డాలర్ల నుండి ఏకంగా 19 శాతం ఎగిసి 71.24 బిలియన్లకు పెరిగింది. ఈ పరిణామం దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. ఇదే సమయంలో ఎగుమతులు మాత్రం 0.6 శాతం పెరిగి 36.56 డాలర్లకు పరిమితమయ్యాయి. ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు ఏర్పడుతుంది.

వాణిజ్య కార్యదర్శి రాజేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–జనవరి కాలంలో భారతదేశ ఎగుమతులు 2.22 శాతం పెరిగి 366.63 బిలియన్లకు చేరుకున్నాయని తెలిపారు. పూర్తి ఆర్థిక సంవత్సరంలో వస్తువులు, సేవల ఎగుమతులు 860 బిలియన్లను దాటవచ్చు అని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత లోటు పెరుగుదల ఆందోళనకరంగానే ఉంది. అమెరికా గతంలో విధించిన 50 శాతం భారీ సుంకాల ప్రభావం జనవరి వాణిజ్య గణాంకాలపై స్పష్టంగా కనిపిస్తోంది. ట్రంప్ ప్రభుత్వం ఈ సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించినా.. దానికి ప్రతిగా రష్యా చమురు కొనుగోళ్లను భారత్ తగ్గించుకోవాల్సి రావడం, అమెరికా వస్తువుల దిగుమతులను రెట్టింపు చేయాల్సి రావడం వంటి షరతులు భారత వాణిజ్య వ్యూహానికి సవాలుగా మారనున్నాయి. మార్చిలో జరగనున్న భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం తర్వాతే ఈ సుంకాల తగ్గింపు పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది, అప్పటివరకు ఎగుమతిదారులు ఒత్తిడిని ఎదుర్కోక తప్పని పరిస్థితి నెలకొంది.

## ఉపాధి హామీ పనిని పరిశీలించిన గ్రామ సర్పంచ్

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :**పాలకుర్తి మండలం భామల నాయక్ తండాలో జరుగుతున్న ఉపాధి హామీ పనిని గ్రామ సర్పంచ్ అఖిల అంజినాయక్ మంగళవారం పనులను పరిశీలించారు.ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట వార్డు సభ్యులు దేవా,రాజేష్ యమునా, రాజేశ్వరి, మంజుల సారయ్యా తదితరులు సందర్శించి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు ఏ విధంగా చేయాలి తగు జాగ్రత్తలు గురించిసూచనలు ఇవ్వడం జరిగింది.



# కరువు భత్యం ఉద్యోగుల హక్కు




భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పొందే కరువు భత్యం (డి.ఎ) ప్రభుత్వం దయతో ఇచ్చే సాయం కాదు. అది వారి శ్రమకు, సేవలకు,అలాగే జీవన వ్యయాల పెరుగుదలకు అనుగుణంగా కల్పించాల్సిన చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన హక్కు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వైద్య ఖర్చులు భరించలేనం తగా పెరిగాయి. గృహ,విద్య,రవాణా వ్యయాలు తీవ్రమయ్యాయి. అయితే, ఈ పెరిగిన భారానికి తగిన పరిహారమైన డి.ఎ మాత్రం ఇవ్వలేదు. ఇది సామాజిక న్యాయం, సంక్షేమ పాలన స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. ఇటీవల గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. "కరువు భత్యం ఉద్యోగుల హక్కు. దాన్ని నిరాకరించడం లేదా నిరవధికంగా వాయిదా వేయడం సమంజసం కాదు." అని కోర్టు స్పష్టంగా పేర్కొన్నది. ఈ వ్యాఖ్యానంతో, డి.ఎ ను ఒక దానంగా కాకుండా చట్టబద్ధమైన హక్కుగా పరిగణించాల్సిందేనని న్యాయస్థానం మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వాలు ఆర్థిక ఇబ్బందులను చూపుతూ ఉద్యోగుల హక్కులను కాలరాయలేవని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

ఉద్యోగులతో పోలిస్తే పెన్షనర్ల పరిస్థితి ఇంకా క్లిష్టమైనది. వారికి ఇతర ఆదాయ వనరులు ఉండవు. వయస్సు కారణంగా వైద్య అవసరాలు అధికంగా ఉంటాయి. కుటుంబ సభ్యులపై ఆధారపడే పరిస్థితులు పెరుగుతాయి. అటువంటి స్థితిలో డి.ఎ / డి.ఆర్ (డియర్‌నెస్ రిలీఫ్) నిలిపివేయడం అంటే వారిని ఆర్థికంగా అశక్తులను చేయడమే. పెన్షన్ అనేది దానం కాదు–అది ఉద్యోగ కాలంలో చేసిన సేవలకు ప్రతిఫలం. అందులో భాగమైన డి.ఆర్ ను నిలిపివేయడం మానవ హక్కుల ఉల్లంఘనకు సమానం.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం, ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవితం గడిపే హక్కు ఉంది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కూడా పౌరులే. అందువల్ల ప్రభుత్వాల బాధ్యత ఏమిటంటే డి.ఎ బకాయిలను పూర్తిగా, వెంటనే చెల్లించాలి. ఆలస్యానికి తగిన వడ్డీతో సహా పరిహారం ఇవ్వాలి. భవిష్యత్తులో డి.ఎ ఫ్రీజ్ వంటి నిర్ణయాలు తీసుకోకుండా చట్టపరమైన హామీ ఇవ్వాలి.

అభివృద్ధి పేరుతో, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న ప్రభుత్వాలు, ఆ అభివృద్ధిని మోసుకొచ్చిన ఉద్యోగుల హక్కులను విస్మరించడం ఘోర అన్యాయం. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు సంవత్సరాలుగా నిరంతర ఉద్యమాలు చేస్తున్నాయి. వారి డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి. డి.ఎ బకాయిలను వెంటనే చెల్లించాలి. పి.ఆర్.సి ల అమలులో డి.ఎ ను సముచితంగా విలీనం చేయాలి. పెన్షనర్లకు సమాన న్యాయం కల్పించాలి. ప్రభుత్వాలు ఇకనైనా న్యాయస్థానాల తీర్పులను గౌరవించాలి. ఉద్యోగులు, పెన్షనర్ల విశ్వాసాన్ని నిలబెట్టాలి.

# సెక్స్ కోసం ప్రత్యేక దీవి

## ఎఫ్ స్టీన్ మాములోడు కాదు

న్యూయార్క్, : కొద్దిరోజులుగా అంతర్జాతీయ మీడియాలో ఎఫ్ స్టీన్ గురించి విపరీతమైన చర్చ నడుస్తోంది.. అతడికి సంబంధించిన ఏవో ఫైల్స్ తెర పైకి వచ్చాయని.. వారంతా కూడా సమాజంలో పేరుపొందిన వ్యక్తులని.. వ్యక్తిగత భోగాల కోసం.. పద్ధతిలేని సుఖాల కోసం వారంతా అక్కడికి వచ్చేవారని.. ఎఫ్ స్టీన్ వారికోసం ఆ దీవిని అలా ఏర్పాటు చేశాడని ఇప్పుడు సరికొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.అమెరికా దేశస్థుల వ్యవహారాలు ప్రపంచానికి కొత్త కాదు. అప్పట్లో బిల్ గేట్స్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు మోనిక లెవెన్స్ తో సాగించిన వ్యవహారం ప్రపంచ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఆ తర్వాత అమెరికాలోని పేరుపొందిన వ్యక్తుల వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి రావడం మొదలైంది. ఇప్పుడు ఈ ఫైల్స్ ద్వారా అమెరికాలో పేరుపొందిన వ్యక్తుల చీకటి వ్యవహారాలు మరింతగా తెలుస్తున్నాయి.ఎఫ్ స్టీన్ భూమ్మీద లేకపోయినప్పటికీ.. అతడు సాగించిన వ్యవహారాలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నాయి. ఎఫ్ స్టీన్ అనేవాడు ఒక బ్రోకర్. వాడి లక్ష్యం ప్రపంచంలో ఉన్న ఆగర్భ శ్రీమంతులకు స్వర్గసుఖాలను అందించడం.. దానిని అతడు వృత్తిగా మార్చుకున్నాడు. ఎఫ్ స్టీన్ కు సెయింట్ జేమ్స్ అనే ఒక సొంత దీవి ఉండేది. దీనికి ఎపి స్టయిన్, పీడో ఫైల్ అనే పేర్లు కూడా ఉన్నాయి. పీడో ఫైల్ అంటే.. కౌమార బాలికల పై ఉండే ఆకర్షణ కలిగి ఉండే ఒక రకమైన సైకో లక్షణం. ఎఫ్ స్టీన్ బ్రోకర్ పని చేసి భారీగా కూడపెట్టాడు. ఇతడికి బోయింగ్ 727 అనే సొంత విమానం ఉండేది. దీనికి అతడు లోలిటా ఎక్స్ ప్రెస్ అనే పేరు కూడా ఉండేది. లోలిటా అంటే కామంత కళ్ళు మూసుకుపోయిన ఒక మృగాడి వాంఛలు తీర్చే కౌమార బాలిక అని అర్థం.ఎఫ్ స్టీన్ కు రాజకీయ నాయకులతో సంబంధాలు ఉండేవి. ప్రపంచ కుబేరులతో సాన్నిహిత్యం ఉండేది. వారికోసం అనేక ప్రాంతాలలో ఉన్న కౌమార బాలికలను ఎఫ్ స్టీన్ అక్కడికి తీసుకొచ్చేవాడు. వారంతా కూడా పేద కుటుంబాలకు చెందిన వారే.లోలిటా విమానంలో ప్రపంచ కుబేరులను అక్కడికి తీసుకెళ్లి.. కౌమార బాలికలతో దారుణమైన పనులు చేసి వచ్చేవారు. ఎఫ్ స్టీన్ కు ఉన్న పరిచయాల ద్వారా అనేకమంది అమ్మాయిలను ఇక్కడికి తీసుకొచ్చేవాడు. తద్వారా దీవిని ఒక భోగం వేళ గా మార్చేశాడు. ఈ బ్రోకర్ పని ద్వారా వచ్చిన డబ్బుతో అతడు అత్యంత విలాసవంతమైన జీవితం గడిపాడు. తర్వాత 2019లో అరెస్టు అయ్యాడు. జైల్లోనే అతడు కన్నుమూశాడు. కొందరేమో ఆత్మహత్య అని.. ఇంకొందరేమో ఈ రహస్యాలు మొత్తం బయటికి వస్తాయని భయంతో పెద్ద వ్యక్తులు అతడిని అంతం చేసి ఉంటారని.. ఇలా రకరకాల ప్రచారాలు వచ్చాయి.ఇక తాజాగా అమెరికా లోని జస్టిస్ విభాగం ఎఫ్ స్టీన్ ఫైల్స్ పేరుతో ఏకంగా 30 లక్షల డాక్యుమెంట్లను, 2000 పైగా వీడియోలను, 1,80,000 పైగా ఫోటోలను బయటపెట్టింది. అందులో బిల్ గేట్స్ కొంతమంది రష్యన్ కౌమార బాలికలతో వ్యవహారాలు సాగించాడని.. అందువల్లే ఆయనకు సుఖ రోగాలు కూడా వచ్చాయని ఆరోపణలు వినిపించాయి. అతడు తీరు నచ్చక మెలిందా విడాకులు కూడా ఇచ్చిందని ప్రచారం కూడా ఉంది.ఎఫ్ స్టీన్ బాగోతం బయటపడిన తర్వాత ప్రసిద్ధ మనుషుల వెనుక ఉన్న నీలి వ్యవహారాలు వెలుగులోకి వచ్చాయి. ఆ తర్వాత వాటికి ఖండనలు కూడా వచ్చాయి. సాధారణంగా మనం ఒకరిని ఆదర్శంగా తీసుకుంటే.. వారి మేధస్సును చూసి పొంగిపోతుంటాం. వారు సంపాదించిన డబ్బు చూసి ఆశ్చర్యపోతుంటాం. కానీ ఆ పెద్ద వ్యక్తుల ముసుగులు తీసి అసలు రూపాలు చూపిస్తుంటే ఆందోళన చెందుతాం. ఎఫ్ స్టీన్ ఫైల్స్ వ్యవహారంలో బిల్ గేట్స్, ఇతర వ్యక్తుల అసలు రూపాలు వెలుగులోకి వచ్చాయి.ఎఫ్ స్టీన్ దీవి గురించి తెలిసిన తర్వాత.. ఇంకా అనేక విషయాలు ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. పేద బాలికలను ఇక్కడికి తీసుకొచ్చేవారు. వారిని లోలిటా విమానంలో తిప్పేవారు. మసాజ్ థెరపీ ద్వారా బాలికలకు మాయమాటలు చెప్పేవారు. ఒక్కసారిగా వారిని ఈ కూపంలోకి లాగేవారు. ఇందులోకి వచ్చిన తర్వాత ఆ అమ్మాయిలకు బయటకు వెళ్లే అవకాశం ఉండేది కాదు. ఇప్పుడు అమెరికా ప్రభుత్వం విడుదల చేస్తున్న ఫైల్స్ కేవలం ఫోటోలు ? వీడియోలు మాత్రమే కాదు.. ఆ బాలికల మౌన రోదన..

# ప్రాణాంతకంగా రక్తహీనత!

## చిన్నారుల్లో 67%, మహిళల్లో 57 % ఎనీమియా
## ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 తాజా డేటాలో వెల్లడి



న్యూఢిల్లీ: మనదేశంలో ఐదేళ్లలోపు చిన్నారులు, మహిళల్లో రక్తహీనత ప్రాణాంతకంగా మారుతోంది. పిల్లలు, మహిళల్లో పోషకాహార లోపం వల్లే రక్తహీనత ఏర్పడుతోందని, ఈ సవాలును తక్షణమే పరిష్కరించా లని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5) తాజా డేటా చెబుతోంది. ఐదు సంవత్సరాల వయసు కలిగిన ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఇద్దరు... అంటే 67.1శాతంమందిరక్తహీనతతో బాధపడు తున్నారని ఆ డేటా తెలిపింది. శిశువులకు జన్మనిచ్చే వయసున్న (15–49 సంవత్సరాలు) మహిళల్లో 57 శాతం మందిని కూడా ఇదే సమస్య వేధిస్తోంది. గర్భిణుల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. వారిలో సగానికి పైగా మహిళలు రక్తహీనతతో బాధపడుతు న్నారు. దీనివల్లతల్లులకేకాదు... పుట్టబోయే బిడ్డలకుకూడా ప్రమాదమే.

గర్భిణుల్లో ఇన్ఫెక్షన్లు, అలసట: రక్తహీనత (అనీమియా) సమస్య ఉన్న గర్భిణులు తరచూ ఇన్ఫెక్షన్లు, అలసటకు గురవుతున్నారు. అనేక ప్రమాదకరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. చిన్నారుల శరీరం వేగంగా, మెదడు చురుకుగా అభివృద్ధి చెందాల్సిన తరుణంలో రక్తహీనత కలిగితే వారు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికమవుతాయి. వారిలో వృద్ధి కుంటుపడుతుంది. చదువు కూడా నెమ్మదిస్తుంది. తల్లుల విషయానికి వస్తే కనిపించని ఆకలి సమస్య వారి శక్తిని నిర్వీర్యం చేస్తుంది. వారిలో ఉత్పాదక సామర్థ్యం తగ్గిపోతుంది. కుటుంబాల బాగోగులను సరిగా చూసుకోలేరు. సమస్యను సకాలంలో పరిష్కరించలేకపోతే అది తరతరాలుగా వెంటాడుతూనే ఉంటుంది.

రక్తహీనతకు కారణం శరీరంలో ఇనుము (ఐరన్) లోపించడమే. ఇది కేవలం ఆహార సమస్య మాత్రమే కాదు. పేదరికం, ఆహార అభద్రత, తరచుగా ఇన్ఫెక్షన్లకు గురి కావడం, పరాన్నజీవుల దాడి, మాతా శిశు ఆరోగ్య సేవలు సరిగా అందుబాటులో లేకపోవడం వంటివి ప్రధాన కారణంగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాలు, పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో ఐరన్ లోపంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. సమస్యను గుర్తించిన తర్వాత, అది ప్రమాదకరంగా పరిణమించిన తర్వాత, శాశ్వత ప్రభావాన్ని చూపిన తర్వాత చికిత్స కోసం పరుగులు పెడుతున్న పరిస్థితి ఉంది.

గత పదేళ్లలో మహిళల్లో రక్తహీనత 4 శాతం పెరుగుదల: ఎన్ఎఫ్‌హెచ్ఎస్–5 డేటా ప్రకారం పిల్లల్ని కనే వయసున్న మహిళల్లో రక్తహీనత సమస్య గత పదేళ్లలో నాలుగు శాతం పెరిగింది. సమస్య పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం 2019లో ఎనీమియా ముక్త్ భారత్ (ఎఎంబి) పేరిట ఓ కార్యక్రమాన్ని చేపట్టినా... ఈ సమస్య తగ్గకపోగా, పెరగడం గమనార్హం. మాతా శిశువులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించడం ద్వారా సమస్యను చాలావరకూ పరిష్కరించవచ్చు. బియ్యం, గోధుమ పిండి, వంట నూనె, పాలు, ఉప్పు వంటి పదార్థాలకు అత్యవసర విటమిన్లు, ఖనిజాలు కలిపితే అదే బలవర్ధకమైన ఆహారం అవుతుంది. ఐరన్, బలవర్ధక ఆహారం శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతాయి. రోగ నిరోధక శక్తిని ఇనుమడింపజేస్తాయి. గర్భిణుల్లో తీవ్రమైన రక్తహీనతను నివారిస్తాయి. ప్రసవ సమయంలో ఇబ్బంది లేకుండా చేస్తాయి. ఐరన్, ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్ల సరఫరాను పెంచితే సమస్యకు కొంతమేర చెక్ చెప్పవచ్చునని నిపుణులు చెబుతున్నారు. మాతా శిశువులకు అవసరమైన ఆహారాన్ని అందించే ఏర్పాట్లు చేయడం, రక్తహీనతకు కారణాలేమిటనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడితేనే ఈ సమస్యను ఎదుర్కోగలుగుతామని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు 1.5 లక్షల క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానినరేంద్ర మోదీ 'పీఎం రాహత్' పథకానికి ఆమోదం తెలిపారు. ఈ పథకం కింద రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి 7 రోజుల పాటు గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది.రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలోని ఏ కేటగిరీ రహదారిపై ప్రమాదం జరిగినా, అర్హులైన ప్రతి బాధితుడికి పథకం వర్తిస్తుంది. అంటే జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు లేదా గ్రామీణ రోడ్లు – ఇలా ఏ ప్రాంతంలో ప్రమాదం జరిగినా బాధితులు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవచ్చు. పీఎం రాహత్ పథకం కింద ఎవరికైనా సరే ప్రమాదం బాధితులకు నిర్ణీత మొత్తం వరకు ఉచిత చికిత్స అందుతుంది. అయితే పథకం రూల్స్ ఇక్కడ తెలుసుకోండి. పీఎం రాహత్ పథకానికి సంబంధించిన రూల్స్ పీఎం రాహత్ పథకం కింద, ప్రమాదం జరిగిన రోజు నుండి 7 రోజుల వరకు ఒక్కో వ్యక్తికి 1.5 లక్షల రూపాయల వరకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఈ చెల్లింపు నేరుగా మోటారు వాహనాల ప్రమాద నిధి) నుండి ఆసుపత్రికి వెళ్తుంది. ఈ పథకం కింద ప్రాణాపాయం లేని కేసుల్లో గరిష్టంగా 24 గంటల వరకు, తీవ్రమైన కేసుల్లో 48 గంటల వరకు 'స్టెబిలైజేషన్' చికిత్స అందించనున్నారు. ఆ తర్వాత కూడా 7 రోజుల వ్యవధిలోపు క్యాష్‌లెస్ చికిత్స అందుకోవచ్చు. ఈ ప్రక్రియ అంతా ఇంటిగ్రేటెడ్ డిజిటల్ సిస్టమ్ ద్వారా జరుగుతుంది. దీనికి పోలీసు ధృవీకరణ అవసరం అవుతుంది. సాధారణ కేసుల్లో 24 గంటల లోపు, తీవ్రమైన కేసుల్లో 48 గంటల లోపు పోలీసుల నిర్ధారణ జరగాలి. తద్వారా చికిత్స అందించడంలో ఎటువంటి ఆటంకం కలగకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగుతుంది. గోల్డెన్ అవర్‌లో చికిత్సపై ప్రాధాన్యతరోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం, దేశంలో ప్రతి ఏటా వేల సంఖ్యలో ప్రజలు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. అందులో చాలా మంది సకాలంలో చికిత్స అందకపోవడం వల్లే చనిపోతున్నారు. ప్రమాదం జరిగిన మొదటి గంట (గోల్డెన్ అవర్) లోపు గాయపడిన వారిని ఆసుపత్రికి చేర్చగలిగితే సుమారు 50 శాతం మరణాలను నివారించవచ్చని పరిశోధనల్లో తేలింది. ఈలక్ష్యంతోనే 112 హెల్ప్‌లైన్ ను ఎమర్జెన్సీ రెస్పాన్స్ సిస్టమ్‌తో అనుసంధానం చేశారు. రోడ్డు ప్రమాద బాధితులు, బాటసారులు లేదా అక్కడ ఉన్న ఎవరైనా సరే 112 నెంబర్‌కు డయల్ చేసి సమీపంలోని ఆసుపత్రి వివరాలను తెలుసుకోవచ్చు. బాధితుల కోసం అంబులెన్స్ సహాయం కోరవచ్చు.ఏడు రోజుల గడువు ముగిసిన తర్వాత కూడా బాధితుడి పరిస్థితి విషమంగా ఉంటే, మెరుగైన చికిత్సను వారి వ్యక్తిగత భీమా11దా ఇతర ప్రభుత్వ పథకాల (ఆయుష్మాన్ భారత్ వంటివి) కిందకు మార్చుకునే వీలుంది. పీఎం రాహత్ పథకం అమలులో నేషనల్ హెల్త్ అథారిటీ (ఔఊం) కీలక పాత్ర పోషిస్తుంది.

# పాఠాలు చెప్పే మాస్టారి ప్రాణాలు కాపాడారు...



పిల్లలకి చదువుతో పాటు జీవన నైపుణ్యాలు నేర్పించడం చాలా ముఖ్యం. చదవడం, రాయడం, మాట్లాడడమే కాదు, ఆరోగ్యం, ఆహారం పట్ల కూడా వారికి శ్రద్ధ పెంచాలి. ప్రభుత్వ బడి, ప్రైవేటు స్కూలు అన్న తేడా లేకుండా ప్రతి స్కూల్లో వివిధ అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించాలి. అలా చేయడం వల్ల విద్యార్థులు తమ కళ్ల ముందు ఉన్న సమస్యని చూసి భయపడరు. దాన్ని ఎదుర్కొనేందుకు ముందుకు వస్తారు. ఒక్కోసారి వారు చేసే ప్రయత్నాలు అద్భుతాలు సృష్టిస్తాయి. ఇటీవల నెల్లూరు జిల్లా ఉదయగిరి మండలం గండిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉదంతం ఈ విషయాన్ని ప్రతిబింబిస్తోంది. ఆ స్కూల్లో పదో తరగతి చదివే వెంకట్ సిద్ధార్థ్ తన తెలుగు టీచర్ మాలకొండరెడ్డి ఉన్నట్లుండి అస్వస్థతకి గురైతే బెంబేలు పడిపోలేదు. టీచర్ల సాయంతో మాస్టారుకి అవసరమైన సిపిఆర్ చేసి ప్రాణాలు నిలబెట్టాడు. ఈ సమయస్ఫూర్తే నేటి పిల్లలకి కావాలి.

ప్రార్థనా సమయంలో పిల్లలందరూ అసెంబ్లీ చేస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. విధుల్లో ఉన్న 61 ఏళ్ల మాలకొండరెడ్డి మాస్టారు అసెంబ్లీ పూర్తవుతుండగా కుప్పకూలిపోయారు. ఒళ్లంతా చెమటలు పట్టాయి. స్పృహతప్పిపోయారు. ఎవరు పిలిచినా పలకడం లేదు. ఆ సమయంలోనే తోటి ఉపాధ్యాయులు చాకచక్యంగా మాస్టారుని గాలి, వెలుతురు వచ్చే ప్రదేశానికి తీసుకెళ్లారు. చేతులు, కాళ్లు రుద్దుతూ, ముఖంపై నీళ్లు చల్లుతూ మాస్టారుని పిలుస్తూ సపర్యలు చేశారు. అయినా ఆయనలో చలనం లేదు. సిపిఆర్ చేసి మాస్టారు ప్రాణాలు కాపాడాలని ఆ ప్రయత్నం కూడా చేశారు. నిమిషాలు గడుస్తున్నాయి. మాస్టార్లు ఆశ వదలకుండా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అప్పుడు అక్కడే ఉన్న పదో తరగతి చదువుతున్న సిద్ధార్థ్ కూడా ముందుకు వచ్చాడు. మాస్టార్లతో పాటు తను కూడా సిపిఆర్ చేశాడు. ఈసారి మాలకొండరెడ్డిలో చలనం వచ్చింది. ఆయన తేరుకున్నారు. ఆ రోజు జరిగిన సంగతిని, సిద్ధార్థ్ చొరవని ప్రిన్సిపాల్ ఆర్ రవీంద్ర ఇలా చెప్పారు.

'మాలకొండరెడ్డి మాస్టారు వచ్చే ఏడాది రిటైర్ అవుతున్నారు. ఆయనకి ఇది వరకే గుండె ఆపరేషన్ జరిగింది. ఆ రోజు అసెంబ్లీలో పడిపోవడంతో మాకు కాళ్లు చేతులు ఆడలేదు. చాలా భయమేసింది. స్టాఫ్‌లో కొంతమంది టీచర్లు మాస్టారుకి స్పృహ తెప్పించాలని చాలా ప్రయత్నాలు చేశారు. ఈలోపు నేను అంబులెన్స్‌కి ఫోన్ చేశాను. అది వచ్చే లోపు ప్రయత్నం చేద్దాం అని అవగాహన ఉన్న ఉపా ధ్యాయులు సిపిఆర్ చేశారు.

వారితో పాటు సిద్ధార్థ్ కూడా ముందుకు వచ్చాడు. చిన్న వయసువాడైనా తను చూపిన చొరవ ఎంతోమంది విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతోంది. మాస్టారు కోలుకున్న తరువాతవాళ్ల అబ్బాయి వచ్చిప్రత్యేకంగా సిద్ధార్థ్‌కి కృతజ్ఞతలు చెప్పారు. చదువులో ఎప్పుడూ చురుకుగా ఉండే సిద్ధార్థ్, ఆపద సమయంలో ఇంత చాకచక్యంగా స్పందిస్తాడని మేం ఊహించలేదు. ఈ ఉదంతం పిల్లలకి చదువుతో పాటు వివిధ జీవన నైపుణ్యాలు నేర్పించాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని చెబుతోంది' అని రవీంద్ర వివరించారు.

సిద్ధార్థ్ కూడా దీనిపై మాట్లాడాడు. 'ఆ రోజు మాస్టారు ఉన్నట్లుండి పడిపోయారు. మిగతా టీచర్లు ఆయనకి సపర్యలు చేస్తున్నారు. సిపిఆర్ చేసేటప్పుడు నేను కూడా చేస్తానని వెళ్లాను. నాకు దానిపై అవగాహన ఉంది. గతంలో మా స్కూల్లో మెడికల్ క్యాంపు పెట్టినప్పుడు సిపిఆర్ ఎలా చేయాలో నేర్పించారు. మా నానమ్మకి గుండెజబ్బు ఉండేది.

కాబట్టి దాని విలువ నాకు తెలుసు. పిల్లలందరికీ మాస్టార్లు అంటే చాలా ఇష్టం. పాఠాలు చెప్పే మాస్టారి ప్రాణాలు కాపాడానని అందరూ అంటున్నారు. మెచ్చుకుంటున్నారు. కానీ ఆ సమయంలో అలా ప్రవర్తించడం నా కర్తవ్యం. మా టీచర్లు కూడా నన్ను ప్రోత్సహించారు. ఈ గౌరవం నా ఒక్కడిదే కాదు,వారిది కూడా'అంటున్న సిద్ధార్థ్ లాంటి చురుకైన, తెలివైన పిల్లలని ప్రతి స్కూల్లో తయారుచేయాలి. కుటుం బం, పాఠశాల పరిస్థితులు పిల్లలకి ఆ వాతావరణం కల్పించాలి.


డాక్టర్లు చెప్పిన విలువైన మాట: మాలకొండరెడ్డి తేరుకునేటప్పటికి అంబులెన్స్ వచ్చింది. వాళ్లు ఉదయగిరి హాస్పటల్‌కి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక నివేదికలో ఆయనకి వచ్చింది గుండెపోటు అని చెప్పారు. అయితే మెరుగైన వైద్యం కోసం మాలకొండరెడ్డిని నెల్లూరు హాస్పటల్లో చేర్పించారు.

అక్కడ అన్ని వైద్యపరీక్షలు పూర్తిచేశాక ఆశ్చర్యపరిచే ఒక విషయం డాక్టర్లు చెప్పారు. ప్రిన్సిపాల్ రవీంద్ర చెప్పిన వివరాల ప్రకారం 'మాలకొండరెడ్డికి వచ్చింది హార్ట్ స్ట్రోక్ కాదు. అది బ్రెయిన్ స్ట్రోక్. సాధారణంగా అలాంటి పరిస్థితుల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడి పరిస్థితి ప్రమాదంగా తయారవుతుంది.

కానీ సకాలంలో ఆయనకి సిపిఆర్ వంటి ప్రాథమిక చికిత్స చేసి ప్రాణాపాయం నుండి కాపాడారు' అని డాక్టర్లు చెప్పినట్లు రవీంద్ర వివరించారు. ఈ విషయంలో సమయస్ఫూర్తితో ప్రవర్తించిన స్కూలు సిబ్బంది, మాస్టర్ సిద్ధార్థ్‌ని తప్పక మెచ్చుకుతీరాలి.

Volume : 3 Issue No. 272 తెలంగాణ దిశ Sunday, April, 26, 2026 ఆదివారం, ఏప్రిల్.26, 2026

# జీవన సాదృశ్యాలు జయంతి కథలు




ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన రచయిత్రి–కవయిత్రి వాసరచెట్ల జయంతి సమాజంలోని సమస్యలపై స్పందిస్తూ తన సంఘర్షణ, ఆర్ద్రత, అందోళన, ఆలోచన, ప్రతిఘటనను సాంద్రంగా వినిపిస్తూ..'నేలవిమానం', 'తురాయిపూలు' శీర్షికలతో రెండు కవితా సంపుటాల్ని వెలువరించి, కవయిత్రిగా తన తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు. శర్వమ్మ పేరు–ప్రాధాన్యత: రచయిత్రిగా ఆవిష్కరించిన తొలికథల సంపుటి 'శర్వమ్మ మరణం' తోపాటు మొత్తం 19 కథలు ఉన్నాయి. ప్రతి కథ ఒక జీవితమే. జీవితాల్లోంచి పుట్టుకొచ్చినదే! రచయిత్రి తన అనుభవంలో చూసిన, విన్న, అంశాలనే తన కథలకు ఇతివృత్తాలుగా చేసుకుని, కొంత కల్పన జోడించి సగటు సజీవ జీవన చిత్రాలను తనదైన శైలిలో చిత్రిస్తూ వచ్చారు. ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి ఈ కథలకు ప్రామాణికమైన ముందు మాటలు అందించారు. మ్యారేజి బ్యూరోల్లో కొందరు అబ్బాయిలు తప్పుడు వివరాలు ఇచ్చి, అమ్మాయిల జీవితాలతో ఆడుకునే పరిస్థితుల్ని 'తూరుపు సిందూరం' కథ కండ్లకు కట్టినట్టుగా చూపెట్టారు. కథలో కథానాయిక మోసాన్ని ధైర్యంగా జయించి ఆత్మవిశ్వాసంతో నిలబడుతుంది. ఆర్థిక బలహీనులు ఆత్మీయులు అయినప్పటికీ వారి స్వేచ్ఛను, స్వతంత్రాన్ని హరిస్తూ... వాళ్ల బతుకుల్ని ఎదుటివాళ్లు ఏవిధంగా కబ్జా చేస్తుంటారో 'ఒక చేతివేళు' కథలో స్పష్టంగా కనిపిస్తుంది. ఆర్తి లోంచి, ఆవేదన లోంచి, మేలుకుని..కోలుకుని.. ఆత్మవిశ్వాసం వైపుగా ప్రయాణించిన కథ 'కొడిగట్టిన దీపం'. తోడు వీడి వెళ్లాక కథలో భర్తను కోల్పోయిన ఒక స్త్రీ, తనదైన ఆత్మవిశ్వాసంతో కొత్త జీవితం ప్రారంభించి, భర్త కలల్ని నెరవేర్చిన తీరు కనిపిస్తుంది. బాధ్యత లేని సంతానానికి గుణపాఠం నేర్పుతూ ఆస్తిని చట్టబద్ధంగా అనాథలకు రాసిచ్చిన కథ 'శర్వమ్మ మరణం'. శర్వమ్మ వీలునామా/ శర్వమ్మ నిర్ణయం వంటి పేర్లు కూడా ఈ కథకు సరిపోతాయి. కానీ 'శర్వమ్మ మరణం' పేరే సరైనది. ఆమె చావు కోసం ఎదురుచూస్తూ... ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించిన కుటుంబ సభ్యులకు, ఆమె మరణం తర్వాత ఎదురయ్యే కోలుకోలేని దెబ్బ... ఆస్తి దక్కకుండా పోవడం. ఆమె చావు కోసం ఎదురుచూసిన వాళ్లే జీవచ్ఛవాలు అయిపోతారు. ప్రాంక్ వీడియోలు, ప్రాంక్ కాల్స్ వల్ల బలహీన మనస్కులకు ఎదురయ్యే ప్రమాదం గురించిన హెచ్చరించిన కథ–వినదగునెవ్వరు చెప్పిన. 'కొత్తతరం' కథ ఒక చైతన్య స్రవంతి. ఈ కథలో రేవతి అనే గ్రామీణ బాలిక తన టీచర్ ద్వారా ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార బ్యాగులు వాడొచ్చని తెలుసుకోవడం, ప్రకృతి పర్యావరణ సందేశాన్ని వ్యాపింపజేయడం ఇందులో కథాంశం. ఫలితంగా అమ్మాయి నివసించే పాలమూరు జిల్లాలో ఉన్న 'సిద్దాయిపల్లె' గ్రామం పేరు హైదరాబాద్‌లో మార్మోగుతుంది. ఇంకా 'ఎండమావి', 'తండ్రి ఋణం', 'సంభవామి యుగేయుగే', 'దిగ్బంధనం' వంటి మనసుకు హత్తుకునే, ఆలోచింపజేసే కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. జయంతి కథల్లో సమస్త జీవన విలువలు కనిపిస్తున్నప్పటికీ, పాత్రలన్నీ మన ఇరుగుపొరుగు వ్యక్తులుగా మనసుకు పరిచయం అవుతున్నప్పటికీ కథల్లో పాలమూరు ప్రాంతీయ జీవన విధానానికి పెద్దపీట వేశారు. అలాగే కథా సందర్భాన్ని అనుసరించి కులాలు–కులవృత్తుల్ని కూడా ప్రవేశపెట్టారు. రచయిత్రిగా జయంతి వాసరచెట్ల పాఠకుల హృదయానికి చేరువయ్యే కథల్ని సృజించారు. ఇందులో కొన్ని కథలు కథ ముగిసిన తర్వాత కూడా మనసును వెంటాడుతాయి. రాసిన ప్రతి కథలో ఒక అర్థాన్ని లేదా ఒక సందేశాన్ని లేదా ఒక పరమార్థాన్ని అందించిన జయంతి రచయిత్రిగా ఈ కథల ద్వారా తన పరిపూర్ణత ప్రదర్శించారని చెప్పవచ్చు. అందరూ తప్పకుండా పుస్తకం కొని చదవాల్సిన కథలు ఇవి. ప్రతులకు: వాసరచెట్ల జయంతి (9985525355).

# బాధితులకు సత్వర న్యాయం

## జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

## గ్రీవెన్స్ డే సందర్భంగా పలు ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల,తెలంగాణ దిశ :** ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఆరుగురు అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# రక్తసంబంధం వర్సెస్ రాజకీయ పంతం

హైదరాబాద్, : రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రాంతీయ రాజకీయాలు ఇప్పుడు ఒకే రకమైన వారసత్వ యుద్ధం చుట్టూ తిరుగుతున్నాయి. ప్రతిపక్షంలో ఉన్నా.. అగ్రనేతల కుటుంబాల్లోని అన్నాచెల్లెళ్ల మధ్య తలెత్తిన విభేదాలు పార్టీల ఉనికిని, ఉమ్మడి ఓటు బ్యాంకును ప్రమాదంలోకి నెడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ , తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి ఎదుర్కొంటున్న ఈ చిత్రమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యను పరిష్కారం చేసుకోవడం వారి వల్ల కావడం లేదు. తెలుగు రాజకీయాల్లో వైఎస్సార్, కేసీఆర్ కుటుంబాలకు ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అన్న వెన్నంటి నిలిచిన చెల్లెళ్లు, ఇప్పుడు అదే అన్నలకు రాజకీయంగా సవాల్ విసురుతున్నారు. ఏపీలో వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు షర్మిల పాదయాత్ర చేసి పార్టీని కాపాడితే, తెలంగాణలో ఉద్యమ సమయంలో కవిత సాంస్కృతిక సారథిగా నిలిచారు. అయితే, నేడు ఏపీలో జగన్–షర్మిల మధ్య ఆస్తుల గొడవలు, రాజకీయ విభేదాలు బహిరంగమై కోర్టుల వరకు వెళ్లగా.. తెలంగాణలో కేటీఆర్–కవిత మధ్య ఆధిపత్య పోరు .. కవిత సొంత పార్టీ దిశగా వెళ్లింది. వైసీపీలో జగన్, షర్మిల మధ్య పోరు కేవలం రాజకీయమైంది మాత్రమే కాదు, కుటుంబ ఆస్తుల పంపకాల్లో తలెత్తిన విభేదాలు కూడా దీనికి ఆజ్యం పోశాయి. తల్లి విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటం పార్టీ కేడర్‌లో అయోమయాన్ని సృష్టించింది. అటు బీఆర్ఎస్‌లోనూ కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం జరిగిన ప్రతిసారీ కవిత వర్గం అసంతృప్తి వ్యక్తం చేయడం, తాజాగా ఆమె కొత్త పార్టీ పెట్టబోతూండటం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య ఉండే రహస్యాలు, లోపాలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన అస్త్రాలుగా మారుతున్నాయి. ఏపీలో షర్మిల చేసే విమర్శలను టీడీపీ, జనసేన తమకు అనుకూలంగా మలుచుకుంటుంటే.. తెలంగాణలో కవిత అరెస్ట్ లేదా ఆమెపై వచ్చే ఆరోపణలను కాంగ్రెస్, బీజేపీలు కేసీఆర్ , ప్రస్తుత పార్టీ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి వాడుకుంటున్నాయి. "ఇంటిని చక్కదిద్దుకోలేని వారు రాష్ట్రాన్ని ఏం చక్కదిద్దుతారు అనే విమర్శలను ఈ రెండు పార్టీలు ఎదుర్కోవాల్సి వస్తోంది.ప్రాంతీయ పార్టీలు ప్రధానంగా ఒక బలమైన నాయకుడి చుట్టూ, ఆ కుటుంబం చుట్టూ కేంద్రీకృతమై ఉంటాయి. అన్నాచెల్లెళ్లు విడిపోవడం వల్ల ఆ కుటుంబానికి ఉన్న సింపతీ ఓటు బ్యాంకు రెండుగా చీలిపోతుంది. ఏపీలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు జగన్, షర్మిల మధ్య నలిగిపోతుంటే.. తెలంగాణలో కేసీఆర్ వారసులుగా కేటీఆర్, కవితలో ఎవరిని నమ్మాలో తెలియక కేడర్ నిరాశలో ఉంది. ఈ చీలిక అంతిమంగా అధికార పక్షాలకు వరంగా మారుతోంది. నేతల మధ్య గొడవలు కేవలం పైస్థాయిలోనే ఉండవు, అవి గ్రామ స్థాయి కార్యకర్తల వరకు చేరుతాయి. వారసత్వ పోరు ఎప్పుడూ ప్రాంతీయ పార్టీల బలహీనతకే దారితీసింది. అన్నాచెల్లెళ్ల ఈ సవాళ్లు సద్దుమణగకపోతే.. రెండు రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్, వైసీపీలు తమ ఉనికిని కాపాడుకోవడం కష్టతరమే. కుటుంబాల్లోని చిచ్చు.. రాజకీయంగా ప్రత్యర్థులకు పెరటిలో పండగలా మారుతుందనడంలో సందేహం లేదు.

# బ్రాహ్మణుల్లోనే కులాంతర వివాహాలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే–2024)లో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కులాంతర వివాహాలు ఎక్కువగా చేసిన కుటుంబాలలో బ్రాహ్మణులు అత్యధికం గా ఉన్నారని తేలింది. ఆ తర్వాత బీసీ/ఎస్సీ క్రైస్తవులు, రాజులు ఉన్నారు.కాపులు, బ్రాహ్మణులతోపాటు బీసీ–ఏలు కూడా కులాంతర వివాహాలలో ఎక్కువ వాటాతో ఉన్నారు. ఏదేమైనప్పటికీ.. వెలమ, రెడ్డి వంటి అగ్రవర్ణాలు కులాంతర వివాహాల రేటును చాలా తక్కువగా కలిగి ఉన్నాయి. ఇది రాష్ట్ర సగటు కంటే చాలా తక్కువగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నేతృత్వం లోని ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ (ఐఈడబ్ల్యూజీ) తెలిపింది. కులాంతర వివాహాలు సామాజిక అడ్డంకులను బలహీనపరుస్తాయి. పెరుగుతున్న సామాజిక చలనశీలతను సూచిస్తాయి, ముఖ్యంగా వ్యక్తిగత ఏజెన్సీ పరంగా, మహిళలు తమ భాగస్వాములను ఎన్నుకోవడంలో ఎక్కువ స్వేచ్ఛను ఉపయోగిస్తున్నారు.కులాంతర వివాహాలతో బ్రాహ్మణులు అత్యధికంగా (12 శాతం), బీసీ–సీ, ఎస్సీ క్రైస్తవులు (9.9 శాతం), రాజులు (8.7 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అగ్రవర్ణాల్లో వధువుల కొరతతోనే కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిసింది. కులాంతర వివాహాల ప్రాబల్యం సమాజం గురించి కూడా చర్చకు దారితీస్తోంది. అధిక పట్టణీకరణ, విద్య కూడా కులాంతర వివాహాలు చేసుకోవడానికి ఓ కారణంగా ఉన్నాయి.కులాంతర వివాహాలకు ఒక ముఖ్యమైన అంశం పట్టణ నివాసం కావచ్చు అని నిపుణులు చెబుతున్నారు. 90 శాతం మంది బ్రాహ్మణులు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని వెల్లడైంది. దీంతో వివాహంలో కుల అడ్డంకులను పెద్దగా పట్టించుకోవడం లేదు. మరోవైపు ఎస్టీ కోలాం(2.6 శాతం), బీసీ–డీ మాలి (2.6 శాతం), ఎస్టీ గోండులు (2.8 శాతం) వంటి కులాలు కులాంతర వివాహాలలో అతి తక్కువ వాటా కలిగి ఉన్నాయి. అయితే దీనికి కూడా పలు కారణాలు ఉన్నాయి. అందుకే కులాంతర వివాహాలకు సంబంధించి వీరు ప్రభావితం అవుతున్నారు. భౌగోళికంగా ఒంటరితనం, పట్టణాలకు దూరంగా ఉండటం, సాంప్రదాయ నిబంధనలకు కట్టుబడి ఉండటం దీనికి కారణమని తెలిపింది. రెడ్డీలు, వెలమాలతో సహా భూ యాజమాన్యంలోని ఫార్వర్డ్ కులాల మధ్య కులాంతర వివాహాల తక్కువగానే జరుగుతున్నాయి. ఆర్థిక పురోగతి, పట్టణీకరణ కొంతమందికి వివాహంలో కుల అడ్డంకులను తొలగిస్తున్నాయి. అయితే కొన్ని కులాల్లో లోతుగా పాతుకుపోయిన ఆలోచనలు, ఇతర కారణాలతో కులాంతర వివాహాలు చేసుకోవడం లేదు. 2024–25లో తెలంగాణ సామాజిక–ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఈఈపీసీ) సర్వే–2024 నిర్వహించింది.

# మహామాయా బండారం బహిర్గతం

## ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం, గృహిణిపై వేధింపులు

## వాట్సాప్‌లో ఫోటోలు, మెసేజ్లు

## ఎఫ్ఐఆర్ ఉన్నా చర్యలు లేవు

## పోలీస్ పరిచయాలు ఉన్నాయంటూ రివర్స్ లో బెదిరింపులు

## బాధితురాలికి అండగా యూత్ ఫోరమ్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**హైదరాబాద్ లో నివాసం ఉంటున్న గోపి కృష్ణ అనే వ్యక్తి ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందడమే కాకుండా, ఓ గృహిణిని లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. సదరు వ్యక్తి ఇంజనీరింగ్‌లో అన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయినప్పటికీ నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంత మందికి ఇలానే ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బాధిత గృహిణితో పరిచయం పెంచుకుని, తరువాత ఆమెను మానసికంగా వేధించడం ప్రారంభించాడు. ఇంటికి వచ్చి ఆమె భర్త లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు ఉన్నాయి. వాట్సాప్ ద్వారా ఫోటోలు పంపిస్తూ, మెసేజ్లు చేస్తూ వేధింపులు కొనసాగించాడని, ఇంతటితో ఆగకుండా బాధితురాలి కుటుంబ సభ్యులు, బంధువులకు మహిళకు సంబందించిన మార్ఫింగ్ ఫోటోలు, మార్పులు చేసిన మెసేజ్లు పంపిస్తూ పరువు నష్టం కలిగించగా బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎఫ్ఐఆర్ నంబర్ 339/2026తేదీ 09-04-2026 నమోదు అయింది. అయినప్పటికీ ఇప్పటివరకు గోపి కృష్ణపై ఎలాంటి విచారణ జరగకపోవడమే కాకుండా, చర్యలు తీసుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గోపి కృష్ణ తనకు పోలీస్ వ్యవస్థలో పరిచయాలు ఉన్నాయని చెప్పి, "ఎవరూ ఏం చేయలేరు" అంటూ బాధితురాలిని బెదిరిస్తున్నట్టు సమాచారం. ఈ ఘటనపై స్పందించిన యూత్ ఫోరమ్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్ ప్రతినిధి పి.బేబీ, ఫేక్ సర్టిఫికెట్ల ర్యాకెట్‌ను పూర్తిగా వెలికితీసి, గోపి కృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అలాగే బాధిత గృహిణికి తక్షణ న్యాయం చేయాలని పోలీస్ శాఖను కోరారు.

# పోషణ పక్వాడ లో అంగన్వాడీ ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే



**రాయికల్,తెలంగాణ దిశ :**ఐ సిడి ఎస్ జగిత్యాల ప్రాజెక్టు రాయికల్ మండలం అల్లీపూర్ సెక్టార్ లోని కుమ్మరిపల్లి గ్రామ పంచాయతీ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో సర్పంచ్ అధ్యక్షతన, సి డి పి ఓ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పక్వాడలో అంగన్వాడి ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిరహించడం జరిగింది.సి డి పి ఓ మమత మాట్లాడుతూ 2018 లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పోషణ పక్వాడ ప్రోగ్రాం భారతదేశ జనాభా ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించడం జరుగుతుంది. విహెచ్ఎస్ఎన్డి(విలేజ్ హెల్త్,శానిటేషన్ న్యూట్రిషన్ డే)లో పిల్లలు బరువులు ఎత్తులు చూసి లోప పోషణ,అతి తీవ్ర లోప పోషణ గురించి తెలపడం జరిగింది.పిల్లల ఆరోగ్యం మరియు మెదడు ఎదుగుదల చాలా కీలకం.పోషకాహార అలవాట్లలో మార్పు తీసుకురావడానికి సమతుల్య ఆహారం వివిధ రకాల పోషకాలు కలిగిన తరచూ చిన్న భోజనాలు,2-3 గంటలకు ఒకసారి చిన్న భోజనాలు ఇవ్వడం.ఇది శక్తి స్థాయిలను నిర్వహించడానికి మరియు పెరుగుదలకు సహాయపడుతుంది.నీటి సమతుల్యత కొరకు, తరచూ నీరు, పాల,మరియు పండ్లరసాలుఇవ్వడం జరుగుతుందని తెలిపారు.పూర్వ ప్రాథమిక విద్యలో భాగంగా 0-6 సంii పిల్లల తో బొమ్మల తయారీ ఇసుకతో ఆటలు ఇలాంటి స్వేచ్ఛయుత ఆటల వలన శారీరక ఆరోగ్యం,మెదడు అభివృద్ధి చెందుతుందని తెలిపారు.3-6 సంii, పిల్లలకు వారి అభివృద్ధి నివేదికలు గుర్తించి స్టార్స్ ఇచ్చి ప్రతి ఇయర్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తామన్నారు.ఇది తల్లి తండ్రుల సమక్షంలో పిల్లలు నేర్చుకున్న వాటితో ప్రదర్శన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పోషకాల గురించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.తర్వాత పిల్లలతోగ్రాడ్యుయేషన్ డే,అన్న ప్రసన్న చేసి గుడ్లు,బా లమృతంటీ హెచ్ ఆర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీయుత సర్పంచ్ గుమ్మడి సంతోష్,ఉప సర్పంచ్ కోడిమ్యాల శేఖర్,సూపర్వైజర్ రాధ,ఏ ఎన్ ఎం ప్రశాంతి,పంచాయతీ సెక్రటరీ కె. రాజేష్,కరోబార్ రాజేందర్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవలక్ష్మి,ఆశ వర్కర్ సుష్మ,రజిత అంగన్వాడీ టీచర్స్ పద్మావతి,వనిత, తల్లులు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# హసన్ పర్తి లో డీసీసీ బ్యాంక్ నూతన బ్రాంచ్ ప్రారంభం

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన అడుగు

**హసన్ పర్తి,తెలంగాణ దిశ :** హసన్ పర్తి మండల కేంద్రంలోని పి.ఏ.సి.ఎస్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యేకేఆర్ నాగరాజు జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ వాజ్పేయి,ఎంపీ శ్రీమతి కడియం కావ్య కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి లతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూగ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ నూతన బ్రాంచ్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.రైతులు,మహిళా సంఘాలు, స్వయం సహాయక బృందాలు,చిన్న వ్యాపారులు సులభంగా రుణాలు, డిపాజిట్ సేవలు,ఇతర ఆర్థిక సౌకర్యాలను పొందేందుకు ఈ బ్రాంచ్ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో డీసీసీ బ్యాంకులు ప్రధాన వనరులుగా పనిచేస్తాయని,రైతులు ఈ అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని



తమ వ్యవసాయ,ఉపాధి కార్యకలాపాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, పిఏసిఎస్ ఇంచార్జ్ జగన్మోహన్ రావు, డిసిసిబి డి డి రవీందర్,ఏవో అనురాధ, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్,వీసం సురేందర్ రెడ్డి ఆరెల్లి వెంకట స్వామి, పెద్దమ్మ నరసింహ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**నారాయణఖేడ్,తెలంగాణ దిశ :**నారాయణఖేడ్ నియోజకవ ర్గం లోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లగృహప్రవేశం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్, నిజాంపేట్, ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజాంపేట్ మండల పరిధిలోని నాగ్ధర్ గ్రామానికి చెందిన వందన – రవీందర్ దంపతుల నూతన గృహ ప్రవేశానికి హాజరై అలాగే కల్హేర్ మండలం పరిధిలోని మహదేవ్ పల్లి గ్రామానికి చెందిన రుక్మిణి లింగయ్య ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ల పథకం అండగా ఉంటుందని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సినిమా

# ధనుష్ మూవీలోకి సారా!




సినీ వైకుంఠపాళిలో ఎవరిని ఎప్పుడు ఏ పాము కాటేస్తుందో... ఏ నిచ్చెన ఎవరిని పైకి తీసుకెళుతుందో ఊహించడం కష్టం. కెరీర్ హాయిగా, జాలీగా సాగిపోతోందని అనుకునేంతలో కొన్ని అవకాశాలు చేజారిపోతుంటాయి. నిస్తేజంగా ఉన్న కొందరిని ఊహించని కొన్ని విజయాలు... హఠాత్తునగా నిచ్చెనలు ఎక్కించేస్తు ంటాయి. ప్రస్తుతం రుక్మిణీ వసంత్, సారా అర్జున్ విషయంలో అదే జరుగుతోంది. 'కాంతార 2' సినిమాతో గొప్ప విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది రుక్మిణీ వసంత్. ఇప్పుడు ఆమె కెరీర్ గ్రాఫ్ బాగుంది. ఎన్టీఆర్, నీల్ మూవీలోనూ రుక్మిణీ వసంత్ నాయికగా చేస్తోంది. అయితే... ఆ క్రేజీ ప్రాజెక్టే... ఇప్పుడు ఆమె పాలిట శాపంగా మారిపోయింది. పలుమార్లు ఈ సినిమా షెడ్యూల్స్ పోస్ట్ పోన్ అయ్యాయి. దాంతో ఆర్టిస్టుల డేట్స్‌ను సెట్ చేసుకోవడం మేకర్స్‌కు పెద్ద కష్టంగా మారిపోయింది. ఇలాంటి సమయంలో ఓ కీలకమైన పాత్రను రుక్మిణీ వసంత్ చేజార్చుకోవాల్సి వచ్చింది. ప్రముఖ తమిళ స్టార్ హీరో ధనుష్ ప్రస్తుతం 'కర' మూవీ చేస్తున్నాడు. ఇది ఏప్రిల్ 30న విడుదల కాబోతోంది. అలానే దీనితో పాటు తమిళరాసన్ పచ్చముత్తు దర్శకత్వంలోనూ ధనుష్ ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఇందులో రుక్మిణీ వసంత్‌ను హీరోయిన్‌గా తీసుకున్నారు.

కానీ ఇప్పుడు ఆమె డేట్స్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో... ఆ స్థానంలోకి సారా అర్జున్ వస్తున్నట్టు తెలుస్తోంది. నిజానికి సారా అర్జున్ తమిళ ప్రేక్షకులకు సుపరిచితమే. బాలనటిగా ఆమె పలు తమిళ చిత్రాలలో నటించి, మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలానే యవ్వన ప్రాయం లోకి అడుగు పెడుతున్న తరుణంలో మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లోనూ నటించింది. అయితే... 'ధరుంధర్' మూవీతో సారా అర్జున్ రేంజ్ అమాంతంగా పెరిగిపోయింది. మరీ ముఖ్యంగా 'ధురంధర్' ఫ్రాంచైజ్ చిత్రాలు రెండు కలిసి మూడువేల కోట్ల గ్రాస్‌ను సాధించడం చిన్న విషయం కాదు. ఆ సినిమాలలో నటించిన సారా... ఇప్పుడు ధనుష్ సరసన నటించడం అంటే... ఖచ్చితంగా ఆ ప్రాజెక్ట్ రేంజ్ పెరుగుతుంది. అయితే... దీనికి సంబంధించి అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి.

## అల్లు అర్జున్- ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్..

# ఎదురుచూపులు తప్పవా?





ప్రస్తుతం టాలీవుడ్‌లో ఎక్కడ చూసినా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాబోయే చిత్రాల గురించే చర్చ జరుగుతోంది. 'పుష్ప 2' సృష్టించిన ప్రభంజనం తర్వాత, బన్నీ తన తదుపరి సినిమాల విషయంలో ఎంతో పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా అట్లీ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'రాకా' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్ అయినప్పటి నుంచే సోషల్ మీడియాలో దీనిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. అట్లీ మార్క్ మాస్ ఎలిమెంట్స్, బన్నీ స్టైలిష్ యాక్షన్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందే ట్రేడ్ వర్గాల్లో విపరీతమైన క్రేజ్ ఏర్పడటం విశేషం. ఇదిలా ఉంటే, అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న ప్రశాంత్ నీల్–అల్లు అర్జున్ కాంబినేషన్ పట్టాలెక్కడానికి మరికొంత కాలం వేచి చూడాల్సిందేనని తెలుస్తోంది. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం ఎన్టీఆర్‌తో కలిసి తన తదుపరి భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌ను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ చిత్రం రెండు భాగాలుగా రాబోతుండటంతో నీల్ పూర్తి సమయాన్ని దీనికే కేటాయించాల్సి వస్తోంది. తన పనితీరులో ఎక్కడా రాజీపడని నీల్, 'ఎన్టీఆర్‌నీల్' ప్రాజెక్ట్ రెండు భాగాలను పూర్తి చేసిన తర్వాతే ఇతర సినిమాలపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఈ షెడ్యూల్ సంక్లిష్టత కారణంగానే బన్నీతో ఆయన చేయబోయే సినిమా కొంత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. మరోవైపు అల్లు అర్జున్ కాల్ షీట్లు కూడా పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం 'రాకా' సినిమాపై దృష్టి సారించిన ఐకాన్ స్టార్, అది పూర్తయిన వెంటనే లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తన 23వ చిత్రాన్ని ప్రారంభించాల్సి ఉంది. లోకేష్ తన సినిమాటిక్ యూనివర్స్‌తో ఇప్పటికే సంచలనం సృష్టించిన నేపథ్యంలో, బన్నీతో ఆయన చేసే సినిమా ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. అట్లీ, లోకేష్ వంటి స్టార్ డైరెక్టర్లతో వరుసగా పని చేయాల్సి ఉండటంతో, ప్రశాంత్ నీల్ ప్రాజెక్ట్ కోసం సమయం సర్దుబాటు చేయడం బన్నీకి కూడా సవాలుగా మారింది. ఈ ఇద్దరు స్టార్స్ తమ ముందున్న బాధ్యతలను పూర్తి చేసే వరకు ఈ క్రేజీ కాంబో సెట్స్‌పైకి వెళ్లడం కష్టమే. అల్లు అర్జున్, ప్రశాంత్ నీల్‌కలయికలో సినిమా అంటే..అది కేవలం ఒక ప్రాంతీయ చిత్రంలా కాకుండా, భారతీయ చలనచిత్ర స్థాయిని పెంచేలా ఉంటుందనడం లో ఎటువంటి అతిశయోక్తి లేదు.

# 'చిరంజీవి'కి మెగా బ్రదర్ నాగబాబు సపోర్ట్



చిరంజీవికి మెగా బ్రదర్ నాగబాబు సపోర్ట్ అనగానే, తన అన్నయ్యకి నాగబాబు సపోర్ట్ చేసేంత ఏముందా? అని ఆశ్చర్యపోవద్దు. ఇక్కడ 'చిరంజీవి' అంటే మెగాస్టార్ చిరంజీవి కాదు. కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా పేరు 'చిరంజీవి'. ఈ సినిమాకే మెగా బ్రదర్ నాగబాబు సపోర్ట్ అందించారు. కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సాయి వెంకట్ దర్శకత్వంలో దీప్తి నడిమింటి నిర్మిస్తున్న చిత్రం 'చిరంజీవి'. తనికెళ్ల భరణి, ఈశ్వరీ రావు, గోపరాజు రమణ, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ వంటివారు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమా.. వేసవి విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మెగా బ్రదర్ నాగబాబు చేతుల మీదుగా టీమ్ విడుదల చేయించారు. ఈ పోస్టర్‌ను విడుదల చేసిన అనంతరం టైటిల్ లుక్ చాలా బాగుందని, సినిమా ఘన విజయం సాధించాలని నాగబాబు చిత్రయూనిట్‌నుఆశీర్వదించారు. తమ చిత్ర ఫస్ట్ లుక్‌ని లాంఛ్ చేసిన నాగబాబుకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపారు. డెక్స్ట్రోకార్డియా (కుడివైపు గుండె ఉండే అరుదైన పరిస్థితి)తో ఉండే చిరు అనే యువకుడు తన జీవితంలో ఎదురైన సంఘర్షణలను,సవాళ్లను, అరుదైన పరిస్థితినిఎలా తట్టుకుని నిలబడ్డాడు? తను అనుకున్న వాటిని ఎలా సాధించాడు? అనేది ఈ చిత్ర కథాంశమని చిత్రయూనిట్ తెలిపింది. ఆద్యంతం ఇంట్రెస్టింగ్‌గా, ఇన్స్‌పైరింగ్‌గా దర్శకుడు సాయి వెంకట్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ప్రేక్షకులను ఎంగేజ్ చేసే అన్ని ఎలిమెంట్స్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని సమ్మర్‌కు రిలీజ్ చేయబోతున్నామని నిర్మాత దీప్తి నడిమింటి తెలిపారు. త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌తో పాటు ఇతర వివరాలను తెలియజేస్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పుకొచ్చారు.

# ఏడేళ్ల తర్వాత... మళ్లీ వస్తున్న 'మడోన్నా'




పాప్ సంగీత ప్రపంచానికి రాణిగా పేరుగాంచిన మడోన్నా.. ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ సంగీత ప్రియులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. 67 ఏళ్ల ఈ సింగర్, తన 15వ స్టూడియో ఆల్బమ్‌కు సంబంధించిన వివరాలను మరో రెండు రోజుల్లో ప్రకటించనున్నారు. 2019లో వచ్చిన 'మేడమ్ ఎక్స్' తర్వాత మడోన్నా నుంచి వస్తున్న ఆల్బమ్ ఇదే కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ఆల్బమ్‌ను మడోన్నా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. గత కొన్నేళ్లుగా ఆమె ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. 2023లో సెప్సిస్‌తో ప్రాణాపాయం నుంచి బయటపడగా, ఆ తర్వాత ఏడాది తన సోదరుడు క్రిస్టోఫర్‌ను కోల్పోయారు. ఈ అనుభవాలన్నీ ఆమె కొత్త ఆల్బమ్‌లో ప్రతిబింబిస్తాయని తెలుస్తోంది. 2005లో తనకు బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన 'కన్ఫెషన్స్ ఆన్ ఏ డ్యాన్స్ ఫ్లోర్' ఆల్బమ్ ప్రొడ్యూసర్ స్టువర్ట్ ప్రైస్‌తో మడోన్నా మళ్లీ పనిచేస్తున్నారు. ఇది ఆల్బమ్‌పై అంచనాలను మరింత పెంచుతోంది. మరోవైపు, ఈ ఆల్బమ్‌లో పాప్ స్టార్ బ్రిట్నీ స్పియర్స్‌తో కలిసి పనిచేసేందుకు మడోన్నా ప్రయత్నిస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి. సుమారు 23 ఏళ్ల క్రితం 'మీ ఎగైనెస్ట్ ది మ్యూజిక్' పాటతో వీరిద్దరూ సంచలనం సృష్టించారు. బ్రిట్నీ ఒక అద్భుతమైన కళాకారిణి అని, ఆమెతో కలిసి పనిచేయడానికి మడోన్నా ఆసక్తిగా ఉన్నారని బ్రిట్నీ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## బుల్లితెర రాములమ్మ క్రేజ్..

# ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా?





ప్రస్తుతం బుల్లితెరపై టాప్ యాంకర్ ఎవరంటే సుమ కనకాల పేరు చెప్పవచ్చు. అయితే ఆ తర్వాతి స్థానం బుల్లితెర రాములమ్మ శ్రీముఖినే అని చెప్పడంలో ఎలాంటి అతి శయోక్తి లేదు. ప్రస్తుతం చేతి నిండా టీవీ షోస్, రియాలిటీ షోస్ బిజీ బిజీగా ఉంటోందీ అందాల తార. బుల్లితెర రాములమ్మ క్రేజ్.. ఒక్కో షోకు శ్రీముఖి రెమ్యునరేషన్ ఎంతో తెలుసా? నెలకు అన్ని లక్షల ఆదాయమా? ఈటీవీ ప్రోగ్రాం పటాస్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంది శ్రీముఖి. అంతకు ముందు జులాయి, నేను శైలజ వంటి సినిమాల్లో హీరో, హీరోయిన్లకు అక్కగా, చెల్లిగా నటించిన ఈ ముద్దుగుమ్మ బుల్లితెర ప్రోగ్రామ్స్ తోనే బాగా పాపులర్ అయ్యింది. ఓ వైపు గ్లామర్ తో ఆకట్టుకుంటూనే మరోవైపు సందర్భానికి తగ్గట్టుగా గలగలామాట్లాడడం, కామెడీపంచులు వేయ డం ఈ ముద్దుగుమ్మ స్పెషల్ ట్యాలెంట్. అందుకే బిగ్ బాస్ వంటి రియాలిటీ షోలోనూ ఈ అందాల తార సత్తా చాటింది. రన్నరప్ గా నిలిచి తన క్రేజ్‌ను అమాంతం పెంచుకుంది.బిగ్ బాస్‌నుంచి బయట కు వచ్చిన తర్వాత టెలివిజన్ ప్రోగ్రామ్స్ మాత్రమే కాకుండా, సినిమా ఆడియో ఫంక్షన్లు, ప్రీ–రిలీజ్ ఈవెంట్లు, ప్రైవేట్ ఓపెనింగ్స్‌తో బాగా బిజీ బిజీగా మారిపోయింది శ్రీముఖి. అదే సమయంలో క్రేజీ అంకుల్స్, మ్యాస్ట్రో, భోళాశంకర్ తదితర సినిమాల్లోనూ నటించి మెప్పించిందీ అందాల తార. మొత్తానికి ఇప్పుడు బుల్లితెరపైనా, అప్పుడప్పుడు వెండితెరపైనా మెరుస్తూ మస్త్ బిజీగా ఉంటోందీ అందాల తార. ఇదే క్రమంలో తన క్రేజ్, పాపులారిటీకి తగ్గట్టుగానే రెమ్యునరేషన్‌ను తీసుకుంటోంది. ప్రస్తుతం ఒక్క షో, ఈవెంట్ కోసం శ్రీముఖి దాదాపు రూ. 2 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లేదా ఫంక్షన్ హోస్ట్ చేయాలంటేఆమె కనీసం రూ.1.5లక్షల నుండి రూ.2.5 లక్షల మధ్య పారితోషికం తీసుకుంటుందని సమాచారం. ప్రస్తుతం ఈటీవీ, స్టార్ మా వంటి ఛానెళ్లలోని పలు ప్రోగ్రామ్స్‌కు హోస్ట్‌గా వ్యవహరి స్తోంది శ్రీముఖి. అలాగే నెలకు కనీసం 3నుంచి 4 సినిమా ఈవెంట్లను కూడా హోస్ట్ చేస్తోంది.ఈ లెక్కన శ్రీముఖినెలవారీ ఆదాయం సుమారు రూ.20 లక్షల నుండి రూ.30 లక్షల వరకుఉంటుం దని అంచనా. ప్రస్తుతం ఈ బ్యూటీకి ఉన్న క్రేజ్, పాపులారిటీ దృష్ట్యా నిర్మాతలు కూడా ఆమె అడిగింది ఇచ్చేందుకు ఏ మాత్రం వెనకాడడం లేదు.

## తెలుగు అబ్బాయిని పెళ్లి చేసుకో..

# 'డెకాయిట్' సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్



డెకాయిట్ సినిమా విడుదలైన కొద్ది రోజుల్లోనే ప్రేక్షకుల్లో చర్చనీయాంశంగా మారింది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన ఈ లవ్‌అండ్ యాక్షన్ థ్రిల్లర్‌కు తొలిరోజు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధిం చింది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ నిర్వహిం చింది. ఈ వేడుకకు నాగ్ అశ్విన్, నందిని రెడ్డి, అల్లు అరవింద్, బన్నీ వాసు, స్వప్న దత్ తదితరులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా మాట్లాడిన అల్లు అరవింద్,హీరో అడివి శేష్‌పై ప్రశంసలు కురిపించారు."శేష్ నిజంగానే 'డెకాయిట్' లాంటి వాడు. మంచి కథలను ఎంచుకుని ప్రేక్షకుల మనసులను దోచేస్తున్నాడు" అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215